ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
మంగళవారం 18 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 62 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## బీహార్ ఆలయంలో తొక్కిసలాట

ఏడుగురు మృతి.. ప్రధాని తీవ్ర దిగ్భ్రాంతి

బిహార్ లఖిసరారులోని అశోక ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతికి గురయ్యారు. తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

న్యూఢిల్లీ,ఆగస్ట్17 (సింగిడి)



2



## బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

మంటలు క్షణాల్లో వ్యాపించడంతో ఏడుగురు మృతి

2

## 22ఎ భూములపై ఆందోళన వద్దు

- అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది
- అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం
- నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం
- టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి
- ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం
- మీడియా సమావేశంలో రెవెన్యూమంత్రి పొంగులేటి వివరణ

2



## డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

- ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా
- సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది
- సిఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు
- పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం
- మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం

2



రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు.

హైదరాబాద్,ఆగస్ట్17 (సింగిడి)



## విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

- విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది
- ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం
- గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు
- వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం
- కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ
- సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

### ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తీసుకొచ్చాం

సిఎం రేవంత్ స్పష్టీకరణ

2

తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్, ఆగస్ట్17 (సింగిడి)

### రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో నిర్వహణ

- మొత్తం 5,410 వినతుల స్వీకరణ ..10,753 మంది అధికారుల హాజరు
- జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి
- ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి వెల్లడి

2

# రి'విజన్'వేషన్లు?

## దేశవ్యాప్తంగా కొత్త డిజిటల్ ఉద్యమం

- మెరిట్ ఆధారిత ఎంపికే కావాలంటున్న RHA
- కులం కాదు.. ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదిక
- రిజర్వేషన్లు సామాజిక ప్రాతినిధ్య హక్కంటున్న మద్దతుదారులు
- రద్దైతే అసమానతలు పెరుగుతాయన్న వాదన

రిజర్వేషన్లు.. మెరిట్.. సామాజిక న్యాయం.. ఈ మూడు పదాలు మరోసారి దేశ రాజకీయాల్లో వేడి పెంచుతున్నాయి. సోషల్ మీడియాలో రిజర్వేషన్ హటావో ఆందోళన్ పేరుతో సాగుతున్న ప్రచారం.. కుల ఆధారిత రిజర్వేషన్లకు బదులుగా మెరిట్, ఆర్థిక పరిస్థితినే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు రిజర్వేషన్లు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తెచ్చిన వ్యవస్థ కాదని.. తరతరాలుగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాలు, అధికార వ్యవస్థలో ప్రాతినిధ్యం కల్పించేందుకు ఏర్పడిన సామాజిక న్యాయ సాధనమని మద్దతుదారులు వాదిస్తున్నారు. ఒకవైపు మెరిట్‌కి అవకాశం.. మరోవైపు ప్రాతినిధ్యానికి రక్షణ.. ఈ రెండు వాదనల మధ్య ఇప్పుడు దేశ రాజకీయాల్లో కొత్త రగడ మొదలైంది.

– హైదరాబాద్ బ్యూరో (సింగిడి )



### కులం వర్సెస్ ఆర్థిక వెనుకబాటు

ఆర్థికంగా వెనుకబడిన ప్రతి కుటుంబానికి అవకాశాలు కల్పించాలన్న డిమాండ్‌లోనూ బలమైన వాదన ఉంది. అయితే పేదరికం ఒక్కటే సామాజిక వివక్షకు కొలమానం కాదని రిజర్వేషన్ అనుకూల వర్గాలు చెబుతున్నాయి. చారిత్రకంగా ఎదురైన సామాజిక వెనుకబాటుతనం, ప్రాతినిధ్య లోపాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వాదిస్తున్నాయి.

### అసలు పరిష్కారం.. విద్యలోనే

రిజర్వేషన్లు ఉండాలా.. పోవాలా అన్న చర్చతో పాటు అసలు సమస్యపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన పాఠశాల విద్య, అందుబాటులో కోచింగ్, డిజిటల్ వనరులు, ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందితే పోటీకి ముందే ఉన్న అంతరాలు తగ్గే అవకాశం ఉంటుంది. రిజర్వేషన్లలో అవసరమైన సంస్కరణలతో పాటు విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం దీర్ఘకాలిక పరిష్కారానికి మార్గం కావచ్చు. చివరికి పోరాటం రిజర్వేషన్లపైనే కాదు.. సమాన అవకాశాలపైనే. వసతులు ఉన్న కుటుంబం, కనీస సౌకర్యాలు లేని కుటుంబం.. ఇద్దరినీ ఒకే ప్రారంభ రేఖపై నిలబెట్టినప్పుడే మెరిట్‌కు నిజమైన అర్థం వస్తుంది. అందుకే రిజర్వేషన్ల భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే ముందు.. సమాన పోటీకి అవసరమైన సమాన ప్రారంభ అవకాశాలను దేశం కల్పించగలిగిందా? అన్నదే అసలు ప్రశ్న.

### మెరిట్.. కానీ ఎవరి నుంచి

రిజర్వేషన్లు తొలగిస్తే అందరికీ సమాన పోటీ ఉంటుందని RHA వాదిస్తోంది. కానీ పోటీకి ముందు అందరికీ సమాన వసతులు ఉన్నాయా అన్నదే అసలు ప్రశ్న. ఖరీదైన విద్య, కోచింగ్, డిజిటల్ వనరులు ఉన్న కుటుంబాల పిల్లలకు సహజంగానే ముందంజ ఉండొచ్చు. కనీస విద్యా సౌకర్యాలు కూడా లేని కుటుంబాల పిల్లలను అదే స్థాయిలో పోటీకి దించడం నిజంగా సమాన అవకాశమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

### రద్దు చేస్తే.. ఎవరికీ లాభం

రిజర్వేషన్లు పూర్తిగా తొలగితే మెరిట్ ఆధారిత పోటీలో వనరులు ఉన్న కుటుంబాల పిల్లలకు మరింత ప్రయోజనం దక్కే అవకాశం ఉందన్న వాదన ఉంది. మరోవైపు గ్రామీణ, పేద, విద్యా వనరులు పరిమితంగా ఉన్న వర్గాలు వెనుకబడే ప్రమాదం ఉందని రిజర్వేషన్ అనుకూల వర్గాలు చెబుతున్నాయి. అందుకే రిజర్వేషన్లను రద్దు చేయడం కంటే.. అసమానతలకు కారణమవుతున్న విద్యా, ఆర్థిక అంతరాలను తగ్గించడమే కీలకమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



2

### భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు

భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్ పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

అమరావతి,ఆగస్ట్17 (సింగిడి)



### సుప్రీంలో రాహుల్‌కు ఊరట

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత

2



### గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ నాగబాబు

ఉత్తర్వులు జారీచేసిన ఎపి ప్రభుత్వం

అమరావతి,ఆగస్ట్17 (సింగిడి): ఏపీ గ్రీనింగ్, 'రీఫారెస్టేషన్' (పునరటవీకరణ) కార్యక్రమాల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నంబర్ -93 ద్వారా ఈ నియామక ఉత్తర్వులు జారీ చేసింది.

2

## డీఎస్సీ నియామకాల్లో.... డీవియేషన్ లేదు

### నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే

- డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు
- ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు
- ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపికి సవాల్
- శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం

మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం.

అమరావతి, ఆగస్టు 17 (ఆర్ఎన్ఏ):

2



### 50 ఏళ్లలో గ్రూప్-1 లాంటి స్కామ్ చూడలే

అసెంబ్లీలో దీనిపై చర్చిస్తాం: సిఎం చంద్రబాబు

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ
- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల

తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ పక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు.

హైదరాబాద్,ఆగస్ట్17 (సింగిడి)

2



## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కొనసాగుతుంది

గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు



- అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి
- దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం
- ధర్నాలు చేసే వారు పథకాలలో తప్పిదాలపై మాట్లాడాలి
- మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

2

ప్రభాతనవ
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

Singidi
మంగళవారం
18 ఆగస్టు 2026

## 22ఎ భూములపై ఆందోళన వద్దు

**హైదరాబాద్,ఆగస్ట్17 (సింగిడి):**

ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తప్పును క్షమాపణలు కోరుతున్నామని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఏ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు క్షమాపణలు చెబుతున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 9947888కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మా ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ ఇవ్వాలని ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలో పరిష్కారం అవుతాయని అన్నారు.

## డబ్బులు దండుకోవడానికే
# నిషేధిత జాబితా

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ అనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి యూఎల్‌సీ కింద 22ఏలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఏ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఏలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎవో-లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు చెల్లించిన తర్వాత.. చివరి నిమిషంలో మీ భూమి 22ఏలో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం సామాన్యుల నిలువునా దోచుకుంటుందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతులు పొంది కొనుక్కున్న భూములను కూడా బ్యాంకులు లోన్లు ఇచ్చిన తర్వాత తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ఫైల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి.. వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి.. కమిషన్ల కోసమేనా.. అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు.. దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టిన వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి. అప్పటిలోగా ఈ ఆస్తులన్నింటినీ దాని పరిధి నుంచి మినహాయించాలన్నారు .

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు
# తొలి విమానం రాక

**అమరావతి,ఆగస్ట్17 (సింగిడి):**


భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రంలో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చరిత్రాత్మక కొత్త ఆరంభమని.. ఉత్తరాంధ్రకు కొత్త గేట్‌వేగా అవతరించనుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఏపీ కొత్త శకానికి నాంది పలికిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.



తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు. టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి.2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి..నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

**హైదరాబాద్,ఆగస్ట్17 (సింగిడి):**

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లయిందని ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు (పిటిషన్లు) అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజావాణి కోసం అధికారులు శాఖ వారిగా డెస్క్ లు, హెల్ప్ డెస్క్ ను, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన వినతులను నేరుగా స్వీకరించడంతో పాటు, ఆయా సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ జిల్లా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 704 వినతులు స్వీకరించబడ్డాయి. అలాగే, ఒక మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది.

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు.

## ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

**హైదరాబాద్,ఆగస్ట్17 (సింగిడి):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను, ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తీసుకున్న నూతన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి అంశంలోనూ చట్టం ప్రకారమే పాలన సాగిస్తూ, ప్రజలకు సంపూర్ణ జవాబుదారీతనంతో సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఆహార పదార్థాలు, నిత్యవసర ఔషధాల నాణ్యతను, భద్రతను పర్యవేక్షించేందుకు ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ను అమలులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నూతన అథారిటీ ద్వారా కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా మార్కెట్లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించడం, నకిలీ , ప్రమాదకర మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు పెరిగి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా పౌరులకు సురక్షితమైన ఆహారం, సమర్థవంతమైన మందులు అందుబాటులోకి వచ్చి, ప్రజారోగ్యానికి సంపూర్ణ భద్రత చేకూరుతుంది. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందించడమే లక్ష్యంగా పనిచేసే సేవలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యవంతమైన, సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో రాష్ట్ర పౌరులందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## 50 ఏళ్లలో గ్రూప్-1 లాంటి స్కామ్ చూడలే

### అసెంబ్లీలో దీనిపై చర్చిస్తాం: సిఎం చంద్రబాబు

**అమరావతి,ఆగస్ట్17 (సింగిడి):**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్ -1 అక్రమాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి తప్పిదాన్ని చూడలేదన్నారు. సోమవారం ఏపీ అసెంబ్లీ లాబీల్లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సీఎం చిట్‌చాట్ చేశారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో గ్రూప్ -1 లాంటి స్కాం చూడలేదని వ్యాఖ్యానించారు. ఆ కుంభకోణంలో ఎంతోమంది మెరిట్ విద్యార్థులు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అసెంబ్లీలో చర్చిస్తామని అన్నారు. బుధవారం సభలో అన్ని విషయాలు చర్చిస్తామని సీఎం పేర్కొన్నారు. డీఎస్సీలో మహిళా టీచర్లు ఎక్కువమంది ఉన్నారని ప్రస్తావించారు. ఆదివారం విజయవాడలో ఉపాధ్యాయులు నిర్వహించిన ఆందోళనలో వారు బాగా మాట్లాడారని తెలిపారు. ఆత్మాభిమానంతోనే ఆత్మగౌరవం కాపాడుకునేందుకు అంతమంది టీచర్లు వచ్చారని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని వైసీపీ నేతలు దెబ్బతీస్తోండటంతో సహించలేక రోడ్డు ఎక్కారని చెప్పారు. మహిళా టీచర్లకు డీఎస్సీతో, ఆ ప్రక్రియతో ఓ ఎమోషనల్ బాండింగ్ ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ నాగబాబు

ఏపీ గ్రీన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం, అడవుల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ఆయా కార్యక్రమాలను అమలు చేయనుంది. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణంలో ఫారెస్ట్, ట్రీ కవర్‌ను 2047 నాటికి 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా ఏపీ సర్కార్ చర్యలు చేపడుతోంది. ఏపీ గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీ, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల పాలక మండళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర గ్రీన్ లక్ష్యాల అమలు, సమన్వయం, పర్యవేక్షణలో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్ కీలక పాత్ర పోషించనున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కొణిదెల నాగేంద్రబాబును నియమించిన ఏపీ సర్కార్.. ఆయనకు కేబినెట్ హోదా కల్పించింది. ఈ నిబంధనలకు లోబడి కేబినెట్ ర్యాంక హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ గ్రీన్, జిల్లా గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల కార్యకలాపాల సమర్థవంతంగా అమలు చేయాలని ఈ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది.

## సుప్రీంలో రాహుల్‌కు ఊరట

### ఆదాయిని మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత

**న్యూఢిల్లీ,ఆగస్ట్17 (సింగిడి):**

కాంగ్రెస్ అగ్రనేత, లోకసేభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జారుమాల్య బాగ్చి, వి. మోహానాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కొనసాగుతుంది

**హైదరాబాద్,ఆగస్ట్17 (సింగిడి):**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లకిë పథకంపై వివరించారు. కళ్యాణ్ లకిë పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లకిë, షాది ముబారక పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లకిë, షాదీ ముబారక లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.



# బీహార్ ఆలయంలో తొక్కిసలాట

ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స వేదికగా ప్రధాని పోస్టు చేశారు. బిహార్‌లోని లఖిసరారులో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు, బాధితులకు బిహార్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదం గురించిన వివరాలను లఖిసరారు జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు. శ్రావణ మాసం సందర్భంగా జలాభిషేకం చేసేందుకు వేలాది మంది భక్తులు అశోక ధామ్ ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. దర్శనం కోసం మహిళలు, పురుషులు రెండు క్యూ లైన్లలో నిలబడి ఉండగా.. పురుషుల క్యూ లైన్‌కు సమీపంలో విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయిందన్నారు. స్తంభానికి ఉన్నది కేబుల్ వైర్ అయినప్పటికీ.. విద్యుత్ వైర్ అనే పుకారు క్షణాల్లో వ్యాపించిందని పేర్కొన్నారు. దీంతో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. రెండు నిమిషాల వ్యవధిలో ఏడుగురు మృతి చెందగా.. దాదాపు 12 మందికి పైగా గాయపడినట్లు జిల్లా మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం సదర్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. మృతులు, గాయపడిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

# బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

**కోల్‌కతా,ఆగస్ట్17 (సింగిడి):**

పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు.. స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృతులను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్ని ప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారి కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ఫైర్ అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 18-8-2026



# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

**రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 17 (సింగిడి):** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం తగదని ఫెడరేషన్ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. రాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి ప్రత్యేకంగా సహాయ, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు. అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురువతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు. సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్. రవికుమార్ తదితరులు ఉన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ నిలిపివేతపై బీఆర్ఎస్ నిరసన

**కూకట్‌పల్లి, ఆగస్టు 17 (సింగిడి):** అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం... నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేస్తూ, లబ్ధిదారులకు చెక్కులు కూడా అందకుండా చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థ ధ్వజమెత్తారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచన మేరకు, కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లా డుతూ... ఆనాటి



ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలి చేందుకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఎంతోమందికి అందించారని గుర్తుచేశారు. కానీ, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని అబద్ధపు హామీలిచ్చి ఆడబిడ్డలను మోసం చేసిందని మండిపడ్డారు. అంతేకాకుండా, ఉన్న పథకానికే ఎసరు పెట్టి ఇప్పటికే రావాల్సిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కూడా అందించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క ప్రభుత్వ స్థలాలు అమ్ముతూ, మరోపక్క పింఛన్లలో కోతలు విధిస్తూ సాగిస్తున్న ఈ ప్రజా వ్యతిరేక పరిపాలనకు త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిరీష బాబురావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ రాజేష్ రాయ్, వెంకటేష్ చౌదరి, పాతూరు గోపి, సాయి శ్రీనివాస్, పవన్, ఉపేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాంబాబు నాయుడు, తులసీ రెడ్డి, వలవల నాయుడు, మాతంగి మల్లేష్, మహిళా నాయకులు భారతి, లత, రమాదేవి, బేగం, పద్మ, హేమ, మణి, ఇందిరా, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

## సింహపురి కాలనీలో ఘనంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 17 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని సింహపురి కాలనీలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగింది. టోర్నమెంట్‌లో బాగంగా నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌కు నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన విజేత జట్టుకు కొలన్ రాజశేఖర్ రెడ్డి ట్రోఫీని అందజేసి, క్రీడాకారులను అభినందించారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడంతో ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు క్రమశిక్షణ, ఐక్యత, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవచ్చన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు.



## రంగారెడ్డి జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా విడుదల

సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తులకు అవకాశం

**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 17 (సింగిడి):** రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ముసాయిదా ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా ఈ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ముసాయిదా జాబితాలో పేరు లేని వారు, వివరాల్లో తప్పులు ఉన్నవారు లేదా మార్పులు, చేర్పులు కోరుకునే వారు సెప్టెంబర్ 16, 2026 లోపు సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 24,12,652 మంది ఓటర్లు తాజా ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 24,12,652 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. పురుషులు 12,12,381, మహిళలు 12,00,062, థర్డ్



జెండర్ 209 ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గాల వారీగా శేరిలింగంపల్లి 4,43,544, రాజేంద్రనగర్ 3,88,278, మహేశ్వరం 3,39,306, ఎల్. బి. నగర్ 3,37,919, ఇబ్రహీంపట్నం 2,59,317, చేవెళ్ల 2,18,274, కల్వకుర్తి 2,16,890, షాద్‌నగర్ 2,09,124 ఓట్లు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 4,43,544 మంది ఓటర్లు ఉండగా, తక్కువగా షాద్‌నగర్ నియోజకవర్గంలో 2,09,124 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## క్రీడాసామాగ్రి అందించిన పూర్వ విద్యార్థులు



**కొడంగల్, ఆగస్టు 17(సింగిడి):** దౌల్తాబాద్ మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలోని పూర్వ విద్యార్థులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్రీడాసామాగ్రి అందజేశారు. ప్రతి చిన్నారి క్రీడల్లో పాల్గొని, క్రీడల్లో మెలుకువ పొందాలన్నారు. క్రీడలు ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తమ వంతుగా క్రీడా సామాగ్రిని అందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, నర్సింహులు, హన్మంతు, అనిల్, రఘునందన్, విష్ణు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ లు అభినందించారు.

## సైబర్ అవగాహనలో ప్రతిభచాటిన గీతం విద్యార్థులు

- 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా పురస్కారం

**పటాన్చెరు, ఆగస్టు 17 (సింగిడి):** ఆన్ లైన్ సైబర్ నేరాలను నిరోధించేలా నిర్వహించిన రాష్ట్ర స్థాయి షార్ట్ వీడియో, రీల్ పోటీలో హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు అగ్రస్థానం సాధించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) తన స్పార్క్ (అవగాహన, బాధ్యతాయుతమైన సైబర్ స్పేస్ కోసం విద్యార్థి కార్యక్రమం)లో భాగంగా 'సురక్షా కా తిరంగా: అప్రమత్తంగా ఉండండి, క్షుణ్ణంగా తెలుసుకోండి, సైబర్ సురక్షితంగా ఉండండి' పేరిట బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఈ పోటీలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున, తెలంగాణ పోలీసు డైరెక్టర్ జనరల్ సి. వి. ఆనంద్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాదులో పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ సహా పలువురు ప్రముఖులు, సీనియర్ పోలీసు అధికారులు హాజరయ్యారు. మోసాల నుంచి స్వేచ్ఛ' అనే ఇతివృత్తంతో స్వాతంత్ర్య దినోత్సవ సైబర్ అవగాహన ప్రచారంలో భాగంగా, విద్యార్థులు, ప్రజలు సురక్షితమైన డిజిటల్ పద్ధతులను అవలంబించేలా, సైబర్ బెదిరింపుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రోత్సహించడానికి, ఆన్ లైన్ మోసాలను నివారించడంపై అవగాహన కల్పించడానికి టీజీసీఎస్బీ



రాష్ట్ర వ్యాప్తంగా ఒక లఘు వీడియో, రీల్ పోటీని నిర్వహించింది. హైదరాబాదు ప్రాంగణంలోని గీతం స్పార్క్ క్లబ్ ఈ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని, తమ ప్రభావవంతమైన సృజనాత్మక ప్రదర్శనకు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. సైబర్ భద్రతను, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తనను ప్రోత్సహించడంలో వారు చేసిన కృషికి గుర్తింపుగా, ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. సైబర్ అవగాహన ప్రచారానికి విద్యార్థులు చేస్తున్న కృషికి మద్దతునిచ్చిన సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాలరెడ్డి సహకారంతో గీతం జట్టు ఈ పోటీలలో పాల్గొంది. సురక్షితమైన, మరింత బాధ్యతాయుతమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన ఈ పోటీలలో విద్యార్థులు చూపిన సృజనాత్మకత, అవగాహన, చురుకైన భాగస్వామ్యానికి గీతం నాయకత్వం వారిని అభినందించింది. ఈ విజయం, గొప్ప సామాజిక చైతన్యం కల్పించడం కోసం తమ జ్ఞానాన్ని, ప్రతిభను వినియోగించడంలో గీతం విద్యార్థులకున్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ లోని కృత్రిమ మేధస్సు-డేటా సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. శశివర్ధన్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. రాష్ట్ర స్థాయిలో లభించిన ఈ గుర్తింపు గీతంకు గర్వకారణమే గాక, సైబర్ అవగాహన, బాధ్యతాయుతమైన సాంకేతిక వినియోగం, సామాజిక ప్రాముఖ్యత గల కార్యక్రమాలలో విద్యార్థుల భాగస్వామ్యంపై విశ్వవిద్యాలయం నిరంతరం చూపుతున్న ప్రాధాన్యతను ఇది నొక్కి చెబుతుంది.

## దేశ ఆర్థిక భద్రత చర్చలకోసం కాలెపల్లి జయప్రకాష్‌కు ఆహ్వానం



**వికారాబాద్, ఆగస్టు 17(సింగిడి):** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం కంకల్ గ్రామానికి చెందిన కాలెపల్లి జయప్రకాశ్ దేశ ఆర్థిక రంగానికి దిశానిర్దేశం చేసే కీలక వేదికపై నిలవడ పరిగి ప్రాంతానికి గర్వకారణం. హైదరాబాద్‌లోని చారిత్రాత్మక నిజాం కాలేజ్ పూర్వ విద్యార్థుల్లో ప్రతిభావంతులైన ఐదుగురు విద్యార్థులను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ తో ప్రత్యేక సమావేశం కోసం ఎంపిక చేశారు. అందులో పరిగి నియోజకవర్గ వాసి జయప్రకాశ్ స్థానం సంపాదించడం విశేషం. ఈ నేపథ్యంలో ఈనెల 16 న ఆదివారం సాయంత్రం 6 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో, దేశ జీడీపీ (జీడీపీ ) వృద్ధి రేటు పతనం కాకుండా అడ్డుకోవడానికి మరియు ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తీవ్రస్థాయిలో చర్చలు జరిగాయి. నిజాం కాలేజ్ ప్రొఫెసర్ షాహిద్ మార్గదర్శకత్వంలో దేశ జీడీపీ పతనం కాకుండా ఉండటానికి మరియు ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి జయప్రకాశ్ బృందం ప్రత్యేక పరిశోధనలు చేసింది. దేశ సేవలో మన దేశ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించడం కోసం జీడీపీ పడిపోకుండా కాపాడటానికి అవసరమైతే మా ప్రాణాలను కూడా అర్పించి నిపుణులైన సలహాలను అందజేస్తామని ఈ సందర్భంగా జయప్రకాశ్ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. పీజీ విద్యార్థుల తరపున ధన్యవాదాలు తెలిపారు. దేశ ఆర్థిక వ్యూహ రచనలో పీజీ పరిశోధక విద్యార్థుల భాగస్వామ్యాన్ని గుర్తించి, ఈ ఉన్నత స్థాయి సమావేశానికి తమను ఆహ్వానించినందుకు కేంద్ర మంత్రికి, అలాగే పూర్తి సహకారం అందించిన అధ్యాపక బృందానికి పీజీ విద్యార్థుల తరపున జయప్రకాశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి, దేశ ఆర్థిక భవిష్యత్తును మరియు జీడీపీ వృద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఆర్థిక మంత్రితో నేరుగా సమావేశమై సలహాలు ఇచ్చే స్థాయికి ఎదిగిన కాలెపల్లి జయప్రకాశ్ కృషి పరిగి తో పాటు తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణంగా నిలిచిందని పలువురు ప్రశంసించారు.

## అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట బ్యూరో, ఆగస్టు 17(సింగిడి):** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో జిల్లాలో సోమవారం రోజున సిద్దిపేట శిశు గృహాలో ఉన్న 4 గురు పిల్లలను కేరళ, కర్ణాటక, తెలంగాణ, రాష్ట్రలకు చెందిన దంపతులకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలన్నారు. తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం కల్పించాలని సూచించారు. పిల్లలకు బంగారు భవిషత్ కు బాట వేసే పూర్తి బాధ్యత తల్లి దండ్రులదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద , జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము మరియు శిశు గృహ మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త వరాజారాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తే సహించేది లేదు

- నార్సింగి సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి
- తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా


**రాజేంద్రనగర్, ఆగస్టు 17 (సింగిడి):** రాష్ట్రంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కీలక సంక్షేమ పథకాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని నార్సింగి సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కే. విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గండిపేట్ తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి, బండ్లగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజ్ ల నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు గండిపేట్ చౌరస్తా నుంచి



తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అర్హులైన లబ్ధిదారులకు తక్షణమే సాయం అందించాలి. నాయకులు మాట్లాడుతూ... అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ప్రయోజనాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గండిపేట్ ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. "పేద వర్గాలకు ఆసరాగా నిలిచే సంక్షేమ పథకాల అమలులో అలసత్వం వహిస్తే ఊరుకునేది లేదు. అర్హులైన లబ్ధిదారులందరికీ వెంటనే ఫలాలు అందేలా చూడాలి. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు ముక్తార్, మాజీ సర్పంచ్ ఉప్పల్ ముత్యాలు, సీనియర్ నాయకులు రవి యాదవ్, వెంకటేష్, రాములు, శాంతి నాయక్, శ్రీనివాస్, జైసింహ, మహిళా అధ్యక్షురాలు నిసా బేగం, మల్లేష్, వార్డు మెంబర్ గణేష్ ముదిరాజ్, గణేష్ రెడ్డి, పెద్దపులి కిషన్, శ్రీకాంత్ రెడ్డి, వాసు, ఫరీదా బేగం, సీమా బేగం, క్షేమమా బేగం, సల్మా బేగం, రజనీకాంత్, అరుణ, రేణుక, కవిత తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలి

ఎమ్మెల్యే కె.పి వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 17 (సింగిడి):** కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మి షాదీముబారక్ సంక్షేమ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు పార్టీ ముఖ్య లతో కలిసి పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి చట్టభద్రత లేదని పిటిషన్ వేస్తే దానిని తిప్పకొట్టే విధంగా ప్రభుత్వ లాయర్లతో అప్పీల్ చేయలేకపోతున్నారని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వడంలో ఈప్రభుత్వం అన్ని విధాలుగా ఫెయిల్ అయిందన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్‌ను కొనసాగించాలి

**కొడంగల్, ఆగస్టు17(సింగిడి):** కోర్టు సాకుతో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిలిపివేయకుండా నిరంతరంగా కొనసాగించాలని బిఆర్ ఎస్ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సోమవారం బొంరాస్ పేట్ మండల కేంద్రంలో లోని ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను నిలిపివేస్తే సహించేది లేదన్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ ల పేరిట ఆసరాగా నిలిచారని, కేసీఆర్ పై కక్ష్య తో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లను తొలగించేందుకు, ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోర్టులలో కేసులు వేయించి, కోర్టు స్టే కారణం చూపుతూ, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లను ఆపేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు పరిశీలించి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయాలన్నారు. రేవంత్ రెడ్డి ఇస్తానన్న తులం బంగారం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ నాయకులు కోట్ల యాదగిరి, శేరినారాయణ రెడ్డి, నెహ్రూ నాయక్, రవిగౌడ్, మాసాని వెంకటయ్య, శ్యామలయ్య గౌడ్, శ్రావణ్ గౌడ్, సలాం, సలీం, అనంత్ గౌడ్, బాల్ రెడ్డి, యు. కృష్ణ, సర్పంచ్ లు సుదర్శన్ రెడ్డి, హీరునాయక్, బాలునాయక్, మల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**సన్నవడ్ల బోనస్ ఇవ్వండి**

యాసంగి పంటకు సంబంధించిన సన్నవడ్ల బోనస్ డబ్బులు ఇప్పటివరకూ రైతులకు అందలేదని బిఆర్ ఎస్ పార్టీ నాయకులు రైతుల పక్షాన ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. యాసంగి వడ్లు అమ్ముకుని మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రైతుల ఖాతాలో బోనస్ డబ్బులు జమకాలేదని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
18-8-2026

# ఎడిటోరియల్

Editorial

## "సర్ప పూజకు ఉద్దిష్టమైనది నాగ పంచమి"

శ్రావణ శుక్ల పక్ష పంచ మిని "నాగ పంచమి" లేదా "నాగుల పంచమి"గా పిలుస్తారు. ఇది సర్పపూజ ఉద్దిష్టమైన దినం. నాగులకు, ఆంధ్రులకు ప్రాచీన కాలమునుండి విశేష సంబంధముంది. భారతావనిలో అనేక ప్రదేశాలలో నాగజాతి వారున్నట్లు చరిత్ర చెబుతున్నది.

కాశ్మీర రాజులు తాము కర్కోటక నాగరాజు సంతతి వారమని చెప్పుకునే వారు. నాగపూరు రాజన్యులు తాము పుండరీక నాగరాజు సంతతికి చెందిన వార మని ప్రకటించుకునే వారు. ఆంధ్రులూ నాగజాతి వారనే వాదన కూడా లేకపోలేదు. బౌద్ధ ధర్మమంటే నాగులకు ఆనురక్తి ఉన్నట్లు, బుద్ధునికి పరమ భక్తులు నాగులు బౌద్ధాన్ని ఆదరించి, అవలంబించారని, బౌద్ధ వాఙ్మయంలో అనేక గాథలు తెలుపుతున్నాయి. ఏలాపత్ర నాగుడు, ముచిలింద నాగుడు మొదలైన వారు బౌద్ధ గాథలలో ప్రసిద్ధులు. దిక్కులను పాలించే లోకపాలకులకు, నాగులకు సంబంధమున్నట్లు బౌద్ధుల విశ్వాసం. శివుడు పార్వతికి నాగ పంచమి పర్వాన్ని గురించి చెప్పినట్లు పురాణ కథనం. అమరావతి, నాగార్జున కొండతో పాటు అవిభక్త కరీంనగర్ జిల్లాలోని ప్రాచీనమైన ధూళి కట్ట తదితర ప్రాంతాలలో బౌద్ధ శిల్పాలలో నాగరాజ, నాగిమల చిత్రాలున్నాయి. ప్రాచీనాంధ్రులు నాగులను కటి ప్రదేశం నుండి పైభాగమంతా మనిషి రూపంలో, క్రింది భాగమంతా సర్పరూపాలలో చెక్కారు. నాగరాజు చిత్రాలకు తలపైన ఐదు పడగలుంటాయి. నాగినికి ఒక్కటే పడగ. భారతావ నిలో నాగపూజ ఆదినుండీ ఆచరణలో ఉంది. గౌతముడు తన గృహ్య సూత్రాలలో పేర్కొనగా, యజ్ఞ మంత్రాలలో నాగుల స్తుతి పేర్కొనబడింది. నాగశిలలు, నాగ కల్లు, ప్రతిమలు ప్రతి చోట దర్శన మిస్తాయి. పుట్టిన బిడ్డలు చనిపోతుంటే సంతానం నిలవడానికి నాగ ప్రతిష్ఠలు చేయడం ఆరాధించడం ఆచారంగా ఉంది. ఆదినుండీ ఆంధ్రులు నాగారాధకులుగా ఉన్నారు. ఆది శేషుడు భూభారాన్ని నిర్వహించడానికి, తమకు సేవ చేయడాన్ని మెచ్చిన విష్ణుమూర్తి, వరం కోరుకొమ్మనగా, తనను పంచమినాడు పూజించే వరమీయమని శేషుడు కోరుకున్నట్లు, విష్ణువు అట్లే వరమిచ్చి, పంచమి నాటి పూజ వల్ల సర్ప భయముండనట్లు వరమిచ్చినట్లు పురాణాధారం. పర్వదినం నాడు ఇంటి గడపలకు ఇరు పక్కలా గోమయంతో నాగుల మూర్తులు ప్రతిష్ఠించి, 12ఏళ్ళు విడవకుండా వ్రతాన్ని ఆచరిస్తే గొప్ప పుణ్యం. ఐదు తలల పాములను వెండితో గాని, మట్టితోనైనా చేసి పూజించడం ఆహారం. చెవిలో చీము పట్టినా, వినపడక పోయినా, చెవులను బంగారు, వెండితో చేయించి శివాలయాలకు సమర్పించడం పరిపాటిగా ఉంది. నాగపంచమినాడు బతికి ఉన్న పామును చూస్తే ఆ దృష్టమని భక్తుల విశ్వాసం. అనంత, వాసుకి, శేష, పద్మనాభ, కంబల, కర్ణాటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళి అని 12రకాల సర్పాలను ఒకొక్క నెలలో పూజించడం ప్రాచీన సాంప్రదాయంగా ఉండేది. ప్రపంచంలో శాస్త్రవేత్తలకు తెలిసిన దాదాపు అన్ని రకాల పాములున్న దేశం భారత దేశమే. తమిళులు శ్రావణ శుద్ధ పంచమి నాడే నాగపూజలు చేస్తారు. కాశీలో శేషుని అవతారంగా భావించే పతంజలిని ఈరోజే పూజి స్తారు. వంగదేశంలో నాగరాజైన వాసుకి సోదరి 'మనసా దేవి' లేదా 'విష హరి' పూజ జరుగుతుంది. మానవుని మానసిక శక్తికి హిందూదేశంలో పాము చిహ్నంగా ఉంది. మానసిక శక్తికి వేదాంత పరిభాషలో కుండలినీ శక్తి అని పేరు. నిస్సంగుల తపస్సు అంతా ఈ కుండలినీ శక్తిని లేపుటకే. కుండలినీ శక్తి గ్రీకు భాషలో "స్పీరిమా" అంటారు. స్పీరియా అంటే సర్పవలయం. కుండలినిని సర్పంటైన్ గా పిలుస్తారు. మూలాధారం నుండి సహస్రారము వరకు వెన్నెముక మధ్యనుండి సర్పాకారముగ కుండలినీ శక్తి అనబడు సుషుమ్నా నాడిని లేవజూపడమే నాగపూజ ప్రధానోద్దేశమని విజ్ఞుల భావన.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

## నిజాంకు తల ఒగ్గని వీర వనిత ఆది లక్ష్మి దేవమ్మ

తమ ఆత్మగౌరవం నిలబెట్టు కోవడం కోసం, పరంపరానుగత హక్కు కోసం, జీవించే హక్కు కోసం ఎందరో సుదీర్ఘంగా సాగిన స్వాతంత్ర్య సమరంలో అసామాన్య రీతిలో పాలు పంచుకున్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి ఎంతో మంది వీరవనితలు సైతం తామూ తక్కువేమీ కాదని నిరూపించారు. అలాగే నిజాం వ్యతిరేక పోరాటం లోనూ భాగస్వాములు అయిన వారిలో వీర వనిత లు కూడా ఉన్నారు. చరిత్ర పుటల్లో చోటు దక్కించు కున్నారు. అలాంటి వీర వనితలలో గద్వాల సంస్థానాధీశురాలు మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ అగ్ర భాగాన నిలిచింది. ముష్టిపల్లి ఇంటి పేరు కలిగిన గద్వాల సంస్థానా ధీశులు పాకనాటి రెడ్లు కాగా, వారి



ప్రథమ రాజధాని రాజపత్రాల్లో కేశవనగరంగా పేర్కొన బడిన పూడూరు. వీరు గధ, వాలు అనే ఆయుధాలను ఉపయో గించి శత్రువులపై విజయం సాధించడం వలన వీరు నిర్మించిన నగరానికి గదవాలు అనే పేరు వచ్చింది. అనంతరం గద్వాలగా వ్యవహరించ బడుతున్నట్లు చరిత్ర కారుల భావన.. గద్వాల సంస్థానానికి ఆధ్యుడు పెద్ద సోమ భూపాల్ (సోమనాద్రి). గద్వాల సంస్థానాన్ని పరిపాలించిన చివరి పాలకురాలు మహారాణి ఆది లక్ష్మి దేవమ్మ.

వాస్తవానికి గద్వాల్ సంస్థాన పాలకులు హైదరాబాద్ నిజాంకు సామంతులు. సంస్థానం ఒకప్పుడు రాయ చూరు జిల్లాలో భాగంగా ఉండేది. తర్వాత అవిభక్త మహబూబ్ నగర్, ఇప్పుడు జోగులాంబ గద్వాల్ జిల్లాలోని గద్వాల్. జిల్లాలోని కోటల న్నిటి లోకి ప్రసిద్ధిచెందిన గద్వాల పట్టణం నడి బొడ్డున ఉంది. ఈ కోటను రాజా పెద్ద సోమభూపాలుడు అలియాస్ నల్ల సోమనాద్రి సా.శ. 1662లో కృష్ణా నది తీరాన గద్వాల కోట నిర్మించి తుంగభద్రకు దక్షిణాన రాజ్యాన్ని బనగానపల్లె, ఆదోని, సిరివెళ్ల, నంద్యాల, సిద్ధాపురం, ఆత్మకూరు, అహోబిళం, కర్నూలు మొదలైన ప్రాంతాలకు విస్తరింప జేశాడు. ఈ సంస్థానం కింద 103 పెద్ద గ్రామాలు, 26 జాగీరులు ఉండేవి. ఇదే కోటలో చెన్నకేశవ స్వామి దేవాల యాన్ని సోమనాద్రియే అత్యంత సుందరంగా నిర్మించాడు. సంస్థానపు వీర వనిత మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ విగ్రహాన్ని కూడా ఇటీవలి కాలంలో ఏర్పాటు చేశారు.

కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత గద్వాల సంస్థానా ధీశులు బహుమనీ సామ్రాజ్యం సామంతులు అయ్యారు. వంశ చరిత్ర ప్రకారం గద్వాలను పెద్ద వీరారెడ్డి, పెద్దన్న భూపాలుడు, సర్గారెడ్డి, వీరారెడ్డి, కుమార వీరారెడ్డి తదితర ప్రముఖ సంస్థానా ధీశులు పరిపాలిం చారు. 1663 నుండి 1950 వరకు గద్వాల సంస్థానాధీశుల ఆధీనంలో ఉండిన ఈ కోట, సంస్థానాల రద్దు తరువాత ప్రభుత్వ పరమైంది.

ఇక అసలు విషయానికి వస్తే...మహారాణి ఆది లక్ష్మి దేవమ్మ గద్వాల సంస్థానాన్ని పాలించిన మహారాణి. రాజా చిన సీతారామభూపాలుని భార్య. ఆయన అనంతరం 1946 నుండి 1949 వరకు పాలన కొనసాగించింది. ఆమె సంస్థానపు చివరి పాలకురాలు కూడా. నిజాం నవాబును ఎదురించిన వీరవనిత. గద్వాల సంస్థానాన్ని స్వతంత్ర సంస్థానంగా ప్రకటించి పాలించింది. సీతారామ భూపాలునికి సంతానం లేక పోవడంచే నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ తమ రాజ్యంలో గద్వాల సంస్థానాన్ని కలుపుకుంటే, రాణి న్యాయ పోరాటం చేసి సంస్థానాన్ని తిరిగి చేజిక్కించుకున్న వీరనారి.

1947లో నిజాం పాలనలో గద్వాల సంస్థానానికి ఆది లక్ష్మీ దేవమ్మ సామంత రాణి. ఆమె హైదరాబాద్ రాష్ట్రాన్ని స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వం లోని దళాలకు సహాయం చేసి, ఆ దళాలు గద్వాల్ మీదుగా హైదరాబాద్ రాష్ట్రంలోకి ప్రవేశించేలా చేసింది. అలా1663లో రాజా పెద సోమభూపాలుడి పాలనతో ప్రారంభమైన గద్వాల సంస్థానపు పాలన 1949లో మహారాణి ఆదిలక్ష్మిదేవమ్మ పాలనతో ముగిసింది. గద్వాల సంస్థానాధీశులు సాహితీ ప్రియులు. కోటలో తరుచుగా సాహిత్య సభలు జరిగేవి. కవులకు సంస్థానా ధీశులు బహుమతు లను కూడా అంద జేసేవారు. చిన సోమ భూపాలుని హయంలో అష్టదిగ్గ జాలనే ఎనిమిది మంది కవులుండే వారు.. వీరి కాలంలో సాహిత్యం విల సిల్లింది. అలా గద్వాలకు విద్వద్గద్వాల అని పేరు వచ్చింది.

మహారాణి ఆది లక్ష్మి దేవమ్మ గద్వాల నుంచి ఇద్దరు చేనేత కళాకారులను ఉత్తరప్రదేశ్ లోని వారణాసికి పంపి బనారస్ జరీ చీరలను నేసేందుకు శిక్షణ ఇప్పించింది. గద్వాల చీర తెలంగాణ చేనేత పరిశ్రమకు ఆలవాలం. గద్వాల్లో తయార య్యే చీరలు దేశంలోనే మన్నికైనవి, పేరెన్నిక గన్నవి. ఇక్కడి నుంచి దేశం లోని ప్రముఖ పట్టణాలకు కళాత్మక చీరలు ఎగుమతి అవుతాయి.

సుమారు నాలుగు శతాబ్దా లుగా గద్వాల సంస్థానా ధీశుల కాలం నుంచి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పంచెలను సమర్పించే సంప్రదాయం ఉంది. నాటి రాజు సీతారాం భూపాల్ గద్వాల సంస్థానాధీశుల ఇష్టదైవమైన వెంకటేశ్వర స్వామి వారికి పంచెలను సమర్పించే పద్ధతిని ప్రవేశ పెట్టాడు. ఆయన వారసులు నేటికికూడా ఈ పద్ధతిని కొనసాగిస్తున్నారు.

1949 లో సంస్థానాల, జాగీర్దా రుల పాలనలు రద్దు కావటంతో రాణి సంస్థానపు ఆస్తులను, చారిత్రాత్మక గద్వాల కోటను ప్రభుత్వ పరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరువాత 1962లో జిల్లాలోనే మొట్ట మొదటి డిగ్రీ కళాశాలను ఈ కోటలోపల ఏర్పాటు చేసింది. డిగ్రీ కళాశాల పేరు కూడా రాణి పేరు మీదుగా మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ (మాల్డ్) డిగ్రీ కళాశాలగా పెట్ట బడింది. ఇది మహబూబ్ నగర్ జిల్లాలో ఏర్పాటైన మొదటి డిగ్రీ కళాశాల. మహా రాణి ఆది లక్ష్మి దేవమ్మ 1953 ఆగస్టు 18న మరణించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## కరుడు గట్టిన స్వాతంత్ర్య యోధుడు నేతాజీ

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో అహింసా మార్గంలోనే మాత్రమే కాదు పోరాట (సాయుధ) మార్గంనూ బ్రిటర్లపై పోరాడుదామని పిలుపిచ్చిన సమర సేనాని నేతాజీ సుభాష్. వలస వాదాన్ని ప్రతిఘటించడంలో ధైర్యంగా పోరాడటం చేయడంలో సుభాష్ చంద్రబోస్‌కు చేసిన కృషి అపూర్వం, అనన్య సామాన్యం, అజరామరం.



ఇండియన్ సివిల్ సర్వీసెస్ కు ఎంపికైనప్పటికీ తృణప్రాయంగా ఉద్యోగాన్ని వదులుకొని దేశానికి స్వాతంత్ర్యం తేవడమే ప్రథమ కర్తవ్యం అని ఉద్యమంలోకి అడుగుపెట్టిన స్వాతంత్ర్య పిపాసి. భారతీయుడు గౌరవప్రద జీవితాన్ని గడపేలా చేసేందుకు తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి.

"ఆజాద్ హిందూ ఫైజ్" ను స్థాపించి భారత్ కు స్వాతంత్ర్యం తీసుకు రావడంలో కీలకపాత్ర వహించాడు. స్వాతంత్ర్యం రావాలంటే సొంత సైన్యంతో పాటు ఇతర దేశాల సహకారం కూడా అవసరమని భావించాడు. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. ప్రతి భారతీయుడు గౌరవప్రదమైన జీవితాన్ని గడపేలా చేసేందుకు గాను తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు.

2021నుండి నేతాజీ జన్మదినమైన జనవరి 23న ప్రతి సంవత్సరం
అంతర్జాతీయ స్థాయిలో 'పరాక్రమ దివస్'గా జరపాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది.

భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అహింస మార్గంలో గాంధీ మార్గంలో కొందరు నాయకుల పోరాటం ఎంత ముఖ్యమో, సుభాస్ బోస్ పోరాట పటిమ అంతే ప్రధానం. తన జీవితంలో స్వార్థం లేకుండా దేశ స్వాతంత్ర్య సాధనే పరమార్థం గా, 12 దేశాలు తిరిగి అతి పెద్ద సైనిక బలగాన్ని ఏర్పాటు చేసి బ్రిటీష్ సామ్రాజ్యానికి వణుకు పుట్టించిన ఒక గొప్ప యుద్ధ వీరుడు సుభాష్ చంద్రబోస్. నివృత్తి కాని సందేహంగా ఆయన అదృశ్యం జరగక పోయి ఉంటే 1947 కంటే రెండు సంవత్సరాల ముందే స్వాతంత్ర్యం వచ్చి ఉండేదని చాలా మంది నమ్ముతారు.

సుభాష్ చంద్రబోస్ జనవరి 23, 1897 లో ప్రభావతి దేవి, జానకి నాద్ బోస్ దంపతులకు కటక్ లో జన్మించాడు. బాల్యం నుండే ఎక్కడ అన్యాయం జరిగిన ఎదురు నిలిచి అడిగేవాడు. ఇంటర్ చదివే రోజుల్లో "స్వేచ్ఛా సేవ సంఘ్" అనే సంస్థ ఏర్పాటు చేసి యువకులకు సమాజ సేవ, ధ్యానం, మానసిక ఆరోగ్యం కోసం వ్యాయామం వంటి అనేక అంశాల పైన ఉపన్యాసాలు ఇచ్చేవాడు. బోస్ కు స్వామి వివేకానంద అంటే ఎంతో ఇష్టం. ఇక 1919లో ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉత్తమ ర్యాంక్ సాధించి శిక్షణ కోసం ఇంగ్లాండ్ వెళ్ళాడు. 1920 లో ఇంగ్లాండ్ లో జరిగిన పరీక్షలో మెరిట్ లో ఉత్తీర్ణుడైనాడు.

అయితే జలియన్ వాలా భాగ్ వార్త తెలిసిన అతడికి మనసులో ఆవేదన కలిగి దానిని మధ్యలోనే వదిలేసి 1921 లో ఇండియా తిరిగి వచ్చాడు. తరువాత గాంధీజీ కలిసి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో చేరాడు. చిత్తరంజన్ దాస్ వద్ద పనిచేసే వాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారత దేశానికి వచ్చినప్పుడు నిరసన తెలిపినందుకు ఆర్నెల్లు జైలు శిక్ష విధించారు. ఇక అయన జైలు నుండే కలకత్తా శాసన సభకు ఎన్నికయ్యాడు. జైలులో నిరాహార దీక్ష వల్ల ఆరోగ్యం క్షీణించడం చూసి బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధిస్తు ఆయనను విడుదల చేసింది. ఆ తర్వాత బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అలా దేశమంతా పర్యటిస్తూ ఆయన చేసే ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరితులయ్యారు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో బోస్ ను నిర్బంధించడం కాకుండా దేశ బహిష్కరణ కూడా చేసారు.

ఆ సందర్భంలో అయన యూరప్ లో పర్యటించి హిట్లర్, ముస్సోలిని వంటి మహనీయులను కలిసాడు. అయితే బోస్ హిట్లర్ ని కలసిన సందర్భంలో ఒక సంఘటన జరిగింది. హిట్లర్ కోసం వేచి చూస్తుండగా ఒక వ్యక్తి వచ్చి విషయం ఏమిటి అని అడుగగా నేను మీ బాస్ హిట్లర్ తో మాట్లాడాలని జవాబిచ్చాడు. అయితే కొద్దిసేపటికి వచ్చిన హిట్లర్ బోస్ తో చర్చలు చేసి వెళుతుండగా నీ వద్దకు "ముందుగా వచ్చిన వ్యక్తి హిట్లర్ కాదని నీకెలా తెలిసింది అని ప్రశ్నించగా, నా భుజాన్ని తట్టే ధైర్యం హిట్లర్ కు తప్ప మరెవ్వరికీ లేదని" ఆయన జవాబిచ్చాడు.

అయితే 1934 వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలు పాలై, ఆరోగ్యం దెబ్బతినడంతో చికిత్స నిమిత్తం ఆయనని ఆస్ట్రియాకు తరలించారు. ఇలా ఆస్ట్రియలో చికిత్స పొందుతున్న ఆయన యూరప్‌లో ఉన్న భారతీయ విద్యార్థులను ఏకం చేసి, వారు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చేయాలని బోస్ భావించాడు.

"ద ఇండియన్ స్ట్రగుల్" అనే పుస్తకం రాసే సందర్భంలో ఇంగ్లీష్ వచ్చి టైప్ చేయగలిగే ఒక వ్యక్తిగా పరిచయమైన 23 ఏళ్ల ఎమిలీ షెంకెల్ అనే ఆస్ట్రియా యువతిని తన సహాయకురాలిగా నియమించు కోగా, ఎమిలీ 1934 జూన్ నుంచి బోస్‌తో కలిసి పని చేయగా, వారి మధ్య ప్రేమ చిగురించిందని చెపుతారు.

స్వాతంత్ర్యం తప్ప వేరే ఆలోచన లేని బోస్ 1934-36 లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు అయినాక దేశమంతా తిరుగుతూ తన ఉపన్యాసాలతో దేశంలోనే అత్యంత ప్రజాధారణ కలిగిన నాయకుడయ్యాడు. ఇలా గొప్ప నాయకుడిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ లో అంతర్గతగా జరిగిన కుట్రల కారణంగా 1939 లో ఆయనను కాంగ్రెస్ నుండి బహిష్కరించారు. ఆ తరువాత వెంటనే ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీ ని స్థాపించి దేశం అంతటా పర్యటించగా ఆయనకి మద్దతుగా కొన్ని లక్షల్లో జనాలు అయన వెంట నడిచారు. ఇలా ఉద్యమ కారుడిగా ప్రజల్లో చైతన్యం నింపుతుండగా 1941 అరెస్ట్ చేసి తప్పనిసరి పరిస్థితుల్లో విడుదల చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. కానీ అయన పథకం ప్రకారం హమ్మద్ జియా ఉల్ హక్ అనే మారు పేరుతో పాస్ పోర్ట్ సంపాదించి తప్పించుకుని తన వ్యక్తి గత సేవకుడు భగత్ రామ్ కు రహమత్ ఖాన్ అని పేరు పెట్టి కాబుల్ కి వెళ్ళాడు. అక్కడ ఉత్తం చంద్ మల్హోత్రా అనే వ్యాపారి ఆయనకి ఆశ్రయం కల్పించగా అక్కడ ఉంటూనే రష్యా, జర్మని, ఇటాలి దేశ రాయబారులతో మంతనాలు చేసాడు.

1941 మార్చ్ 18 న అక్కడి నుండి ఒర్లాండ్ అనే మారు పేరుతొ సమర్ఖండ్, మాస్కో ల మీదుగా బెర్లిన్ చేరుకొని జపాన్, ఇటలి, జెర్మని లకు చెందిన సైన్యాధికారులను కలుసు కున్నాడు. ఇలా చేరుకున్న బోస్ ను వారు స్వతంత్ర భారత రాయబారిగా గుర్తించారు. ఆ తరువాత బోస్ అక్కడే ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించాడు. 1941 ఫిబ్రవరి 27 న బోస్ రేడియోలో ఇచ్చిన ప్రసంగం యావత్ దేశాన్ని కదిలించింది.

ప్రపంచ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో జపాన్ లోని ఆజాద్ హింద్ ఫౌజ్ సభ్యులు బోస్ ను అక్కడికి ఆహ్వానించగా 45 రోజుల పాటు జలాంతర్గామిలో ప్రయాణించి అక్కడ మత్సుడ అని పేరు మార్చు కున్నాడు. అక్కడ బోస్ ఇచ్చిన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలతో హింద్ ఫౌజ్ లో తండోప తండాలుగా సైనికులు చేరారు. ఇక్కడ మహిళలకు ప్రత్యేకంగా ఝాన్సీ లక్ష్మీ బాయి రెజిమెంట్ ను ఏర్పాటు చేసి మహిళలకు యుద్ధ శిక్షణ నివ్వడం మొదలు పెట్టారు.

ఇలా ఎంతో శక్తివంతమైన సైన్యాన్ని తయారుచేసి చలో ఢిల్లీ అనే నినాదంతో ప్రత్యక్ష యుద్దానికి దిగి జపాన్ సహకారంతో ఇంఫాల్, అండమాన్, నికోబార్ లను జయించి అక్కడ స్వతంత్ర భారత పతాకాన్ని ఎగురవేసి ముందుకు సాగుతుండగా ఆయనకి కష్టాలు మొదలయ్యాయి. తనకు అండగా నిలిచినా జపాన్ దేశం యుద్ధంలో ఓటమికి చేరువైంది. ఇక బర్మాలో వరదల కారణంగా ఆరోగ్యం క్షీణిస్తూ అనేక మంది సైనికులు మరణించారు. ఆ సమయంలో రష్యా దాడికి దిగి, అణుబాంబు వేయడంతో జపాన్ అతలాకుతలం అయింది. అప్పటివరకు తనకు అండగా ఉన్న జపాన్ అలా అవ్వడంతో బోస్ నిస్సహాయు డైనాడు. ఆ తరువాత సింగపూర్, రంగూన్ సైనిక దళాలకు బ్రిటిష్ దళాలు దగ్గరయ్యాయి. 1945వ సంవత్సరం ఆగష్టు భారత జాతీయ సైన్యానికి సహకరించిన జపాన్ సైనిక దళాలు బ్రిటిష్ సైనిక దళాలకు శరణుజొచ్చాయి. దీనితో నేతాజీ సింగపూర్‌ను వీడి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 1945 ఆగష్టు 18 వ తేదీన తైపీలో జరిగిన విమాన ప్రమాదంలో అయన మరణించి నట్లుగా రేడియో లో ప్రకటించారు.

ఇక తైవాన్ కి సంబంధించిన ఎయిర్ క్రాష్ లో చంపేశారని కొందరు, ఆగష్ట 1945 తర్వాత నేతాజీ రష్యాలో ఉన్నాడని చెప్పడం వల్ల అతను చనిపోలేదని మరికొందరు, సుభాష్ చంద్రబోస్ మారువేశంలో మన దేశం లోనే ఉన్నాడని ఇలా ఎన్నో రకాలుగా చెప్పుకునేవారు. సైన్యానికి శిక్షణ ఇచ్చేప్పుడు... "నేను మీకు కేవలం ఆకలి, దాహం, కష్టం, మృత్యువును మాత్రమే ఇవ్వగలను. నాకు మీ రక్తాన్ని ఇవ్వండి. మీకు స్వతంత్రాన్ని ఇస్తాను"... అని సైన్యంలో విశ్వాసాన్ని చిగురించేలా చేసేవాడు. దేశం కోసం ఎవరు చేయని విధంగా అహింస వలన కాదు, పోరాడితేనే స్వాతంత్ర్యం వస్తుందని కట్టు బట్టల్తో జపాన్ వెళ్లి ఇండియన్ ఆర్మీని సిద్ధం చేసి బ్రిటిష్ సైన్యానికి గుండెల్లో రైళ్లు పరిగెత్తించి చివరికి స్వాతంత్ర్య చూడ కుండానే కనుమరుగైన యోధుడు బోస్. నేతాజీ సుభాస్ చంద్రబోస్ యొక్క విలువైన వారసత్వాన్ని, చరిత్రను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం అనేక రకాల చర్యలను చేపట్టింది. న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద నేతాజీపై మ్యూజియం ఏర్పాటు చేశారు. దీనిని 23.01.2019న ప్రధాని ప్రారంభించారు. దేశంలో చారిత్రాత్మక విక్టోరియా మెమోరియల్ భవనంలో కోల్‌కతాలో నేతాజీపై లైట్ అండ్ సౌండ్ షో శాశ్వత ప్రదర్శన ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేయ బడింది. అండమాన్, నికోబార్‌లోని 3 ద్వీపాలకు పేరు మార్చి ప్రధాని మోదీ రాస్ ద్వీపానికి నేతాజీ సుభాష్ "చంద్రబోస్ ద్వీపంగా" పేరు మార్చారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

## ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి



- క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్, ఆగస్టు17(సింగిడి):** నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతిలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత విభాగాల అధికారులకు పరిష్కారం కోసం అప్పగించారు. ప్రజావాణికి మొత్తం 23 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 12, రెవెన్యూ 5, ఇంజినీరింగ్ 2, పారిశుధ్యం 1, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 3 దరఖాస్తులు ఉన్నాయి. ప్రధానంగా ఆక్రమణల తొలగింపు, అనుమతులు లేని నిర్మాణాలు, పన్నుల సవరణ, నూతన ఆస్తుల నమోదు, ఇందిరమ్మ ఇళ్లు, పారిశుధ్య సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆయాజ్, సహాయ కమిషనర్ రాజమనోహర్, డీసీపీ బషీరొద్దీన్, ఏసీపీ వేణు, ఇన్‌చార్జి కార్యనిర్వాహక ఇంజినీర్ లచ్చిరెడ్డి, ఆయా విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## నాగుల పంచమి సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి



**జమ్మికుంట, ఆగస్టు 17 (సింగిడి):** శ్రావణమాసం సోమవారం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని అతి పురాతనమైన శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని అతి పురాతనమైన విశ్వేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమవారం రోజున శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతోపాటు నాగుల పంచమి సందర్భంగా వందలాది మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నాగేంద్రునికి పాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ విధంగా శ్రావణమాసంలో సోమవారం రోజున శివునికి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ శ్రావణమాసంలో సోమవారం రోజున నాగుల పంచమి రావడం అత్యంత విశేషమైన రోజు అని ఈ రోజున పూజలు నిర్వహించడం వల్ల భక్తుల కోరిన కోరికలు నెరవేరుతాయని జమ్మికుంట పట్టణ ప్రజలపై ఆ విశ్వేశ్వరుని దీవెనలు ఉంటాయని పేర్కొన్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఉద్యోగులకు సన్మానం

### రాజిరెడ్డి, భాస్కర్‌లను సన్మానించిన మున్సిపల్ చైర్మన్




**జమ్మికుంట, ఆగస్టు 17 (సింగిడి) :** విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ కనబరిచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న జమ్మికుంట మున్సిపాలిటీ లో మేనేజర్ గా పని చేస్తున్న గుర్రాల రాజిరెడ్డి రెవెన్యూ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న భాస్కర్ ను మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ సోమవారం తమ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడిన ఉత్తమ సేవా పురస్కారాల అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. వారు నిస్వార్థంగా నిస్పక్షపాతంగా సేవలు అందించడం అభినందనీయమని భవిష్యత్తులో ఇదే విధంగా పనిచేస్తూ మున్సిపల్ పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ కౌన్సిలర్లు చందా రాజు దిడ్డి రాము వేణుగోపాలరావు అజయ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 10 అర్జీల స్వీకరణ

**కాటారం, ఆగస్టు 17(సింగిడి) :** కాటారం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అధికారులకు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం 10 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో



ఎంపీడీవో, నోడల్ అధికారి, అడ్డూరి బాబు, తాసిల్దార్ నాగరాజు, వ్యవసాయ శాఖ అధికారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. మొత్తం 16 శాఖలకు చెందిన అధికారులు ప్రజావాణికి హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ఉద్యోగ జీవితంలో బదిలీ సహజం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే.జీవన్ కుమార్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో ఆగస్టు 17 (సింగిడి) :** ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిజామాబాద్ కోర్టుకు బదిలీ అయిన జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి. అనితావనికి జిల్లా కోర్టు ప్రాంగణంలో వీడ్కోలు సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఎక్కడికి బదిలీ అయినా ఆయురారోగ్యాలతో, విధుల పట్ల నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. అనితావని అందించిన సేవలను అభినందిస్తూ, కొత్త ప్రదేశంలోనూ మరింత మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందారపు శివకుమార్, న్యాయవాదులు వెంకటస్వామి, అబ్దుల్ కలాం, సూపరింటెండెంట్లు రఘురాం, సదానందం, సీనియర్ అసిస్టెంట్ జి.సురేందర్‌తో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో మౌలిక వసతులపై ప్రత్యేకదృష్టి

### నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**కరీంనగర్, ఆగస్టు17(సింగిడి):** కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రతను మెరుగుపరచాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అవసరమైన నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం జిల్లా కలెక్టర్, సంఘం చైర్‌పర్సన్ చిత్రా మిశ్రా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు నిరుపేదలు అధికంగా వస్తున్నందున వారికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఆసుపత్రి వెలుపల పోలీసు భద్రతను పటిష్టం చేయాలని




అన్నారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి రూ. 40 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కనీస అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ పారిశుధ్యం, పచ్చదనం, భద్రతకు చర్యలు చేపట్టాలని, అవసరమైన సహకారాన్ని నగరపాలక సంస్థ అందిస్తుందని అన్నారు. కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, ఆసుపత్రిలో ప్రత్యేక సహాయవాణి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా సదరం, ఆరోగ్య కేంద్రం, మందుల పంపిణీ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు సకాలంలో అందేలా చూడడంతోపాటు వారి సేవలను పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ఆదాయ వనరులను సమర్థంగా వినియోగించి అభివృద్ధి పనులను నిబంధనల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్యాధికారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ తక్కుద్దీన్ ఖాన్, ఆర్ఎంవో నవీన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై భగ్గుమన్న బీఆర్ఎస్ నాయకులు

### సంక్షేమ పథకాలు కొనసాగించాలని నిరసన

### కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం అందించాలి

### తహసిల్దార్‌కు వినతిపత్రం అందించిన గులాబి నేతలు

**జమ్మికుంట, ఆగస్టు 18 (సింగిడి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అలాంటి ప్రయత్నాలు ఉపసంహరించు కొని పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం మండిపడుతూ జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి ఎమ్మార్వో కు వినతిపత్రం అందించిన బీఆర్ఎస్ శ్రేణులు. సోమవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏ డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది టిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలు చేస్తూ సంక్షేమ పథకాల అమలు చేయాలని నిరసిస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు



ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ పిఎసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్ లు మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెలుగింటి ఆడబిడ్డల పెళ్లికి మేనమామ కట్నం కింద లక్ష రూపాయలను కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేరుతో అందించి ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపారని తెలిపారు. అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేస్తూ ఆ పథకాలు తీసివేయాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఇది దిక్కుమాలిన చర్యని వారు ఆరోపించారు. గత ఎన్నికల ముందు కళ్యాణ లక్ష్మి పథకం తో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇచ్చిన హామీని నెరవేర్చుకోలేదని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 420 హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని కాల్చివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ జావిద్ జమ్మికుంట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సురేందర్రావు మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డి మాజీ రైతు సమన్వయ కమిటీ నాయకులు లింగారావు మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ రఫీ కౌన్సిలర్లు పొన్నగంటి రాము డాక్టర్ కే సురంజన్ వేణుగోపాలరావు తో పాటు నాయకులు మాజీ ఎంపీటీసీ తోట లక్ష్మణ్ మనోహర్ రావు పర్లపెల్లి రమేష్ పాతకాల రమేష్ మైనారిటీ నాయకులు ఎండి జానీ గాజుల భాస్కర్ బీసీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు వజ్జపల్లి శ్రీనివాస్ బిట్ల రాజేందర్ రాచపల్లి వంశీ గరిగంటి శ్రీనివాస్ తో పాటు పలువురు టిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోల కీలక తీర్మానాలు

### పీఆర్సీ ప్రకటించాలి. పెండింగ్ డీఏలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**కరీంనగర్,ఆగస్టు17(సింగిడి):** నాంపల్లిలోని తెలంగాణ నాన్-గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ కార్యాలయంలో టీఎన్జీవోల రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ముజీబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశంలో ఉద్యోగుల పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు, పదవీ విరమణ ప్రయోజనాలు, ఉద్యోగుల ఆరోగ్య పథకం తదితర సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సెప్టెంబర్ 1న పెన్షన్ వ్యతిరేక దినంగా పాటించి, పెన్షన్ విధానంలో ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై



నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకంలోని లోపాలను వెంటనే సవరించి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల పీఆర్సీని తక్షణమే ప్రకటించి అమలు చేయడంతో పాటు పెండింగ్ డీఏలు, బిల్లులు, పదవీ విరమణ ప్రయోజనాలను ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర కార్యవర్గం దృష్టికి తీసుకువచ్చారు. టీఎన్జీవోల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో జెండా, కండువా ఆవిష్కరణ ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జీవితకాల సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా సభ్యుల నుంచి సేకరించిన రూ. 2.82 లక్షల చెక్కును కేంద్ర సంఘ నాయకులకు అందజేశారు. జిల్లా సంఘం కృషిని కేంద్ర సంఘ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంఘము లక్ష్మణరావు, సర్దార్ అరవిందసింగ్, రాగి శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంకూరు శంకర్, సందీప్‌రెడ్డి, మిర్యాల నాగేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రవీణ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

### తులం బంగారం హామీ అమలు చేయలేకే పథకాలపై కుట్రలు

### ఎన్నికల 420 హామీలు ఆరుగ్యారంటీలు అమలు చేయాలి

### మాజీ ఏంఎల్ఏ రసమయి బాలకిషన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణ రావు

**కరీంనగర్, ఆగస్టు17(సింగిడి):** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షుడు జి.వి.రామకృష్ణరావు ఆదేశాలతో మానకొండూర్ మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రసమయి



బాలకిషన్ రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ తూల ఉమా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయలేక పథకాలపై న్యాయపరమైన సమస్యలు సృష్టిస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జివి. రామకృష్ణరావు మాట్లాడుతూ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి పథకాలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సామాజిక మాధ్యమాల కన్వీనర్ పావని గౌడ్, అధికార ప్రతినిధి శతరాజ్ యాదగిరి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సొసైటీ అందిస్తున్న పథకాలపై విద్యార్థుల క్షేత్ర పరిశీలన

### సహకార సొసైటీని సందర్శించిన అగ్రికల్చర్ విద్యార్థులు

### రైతులకు అందిస్తున్న సేవలను వివరించిన పిఎసిఎస్ చైర్మన్

**జమ్మికుంట, ఆగస్టు 17 (సింగిడి) :** చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ హైదరాబాద్ అగ్రికల్చర్ విద్యార్థులు సురేష్ జ్ఞాన విహార్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు సోమవారం జమ్మికుంట పట్టణంలోని రైతు సహకార సంఘాన్ని సందర్శించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాజెక్టు వర్క్ నిర్వహిస్తున్న ఈ యూనివర్సిటీల అగ్రికల్చరల్ విద్యార్థులు రైతులకు సహకార సంఘం అందిస్తున్న సేవలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులకు పిఎసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి విద్యార్థుల కు సొసైటీ అందిస్తున్న సేవల గురించి పూర్తిగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులకు సొసైటీ ద్వారా ఏ రకమైన సంక్షేమ పథకాలు అందిస్తారని వారికి సహకార సంఘం ద్వారా రుణాలు ఎలా ఇస్తారని పలు ప్రశ్నలు అడిగారు. దానికి స్పందించిన సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ, సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతుకు ఒక ఎకరానికి 40 వేల రూపాయలను అప్పుగా ఇస్తామని అది కూడా 3




లక్షల వరకు మాత్రమే ఇస్తామని తెలిపారు. ఇచ్చిన అప్పు 6 నెలలకు చెల్లించాలని దానికి తక్కువ వడ్డీ ఉంటుందని ఒకవేళ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రుణం మాఫీ అవుతుందని లేకపోతే తిరిగి చెల్లించాల్సి ఉంటుందని విద్యార్థులకు తెలిపారు. అంతేకాకుండా బంగారం తాకట్టు పెట్టుకొని కూడా రైతులకు అతితక్కువవడ్డీకి రుణాలు అందిస్తామని ఇది కేవలం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘం అని తెలిపారు. ఇవే కాకుండా రైతులకు సబ్సిడీ రేట్లపై ఎరువులు అందిస్తామని వాటితోపాటు ఐకెపి కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సొసైటీ ఉంటుందని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపి ఇలాంటి సహకార సంఘాల సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం వల్ల మాకు కొన్ని విషయాలు సులభంగా తెలుసుకోవడం జరుగుతుందని సొసైటీ చైర్మన్ పొన్నగంటి సంపత్ అందించిన సహకారం మరువలేనిది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కౌన్సిలర్ పొన్నగంటి రాము హైదరాబాద్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు డి నవ్య వి జోష్నా ఎన్ మమత రెడ్డి మనిషా హాజీరా మనిషి గంగా రేణుక ప్రవళిక సంధ్యారెడ్డి తోపాటు సురేష్ విజ్ఞాన విహార్ యూనివర్సిటీ విద్యార్థులు కే స్నిగ్ధ కే మోహన ప్రియదర్శిని డి యేసు రాజ్యం బి లహరి ఎస్ లిఖిత ఎం నాగ పూజిత కల్పన పి నవ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్యాటరీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



**జమ్మికుంట, ఆగస్టు 17 (సింగిడి):** బ్యాటరీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామంలో చోటుచేసుకుంది. వీణవంక పోలీసుల వివరాల ప్రకారం ఘన్ముక్ల గ్రామానికి చెందిన గాజుల సమ్మయ్య తన వ్యవసాయ పొలం సొంత ట్రాక్టర్ తో దున్ని ట్రాక్టర్ అక్కడే ఉంచాడు. రెండు రోజుల తరువాత వెళ్లి చూడగా తన ట్రాక్టర్ నుండి బ్యాటరీ తొలగించబడి ఉండటంతో ఈనెల 15న స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసాడు. ఎస్సై ఆవుల తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా కొలిపాక శ్రీకాంత్ అనే వ్యక్తి బ్యాటరీ దొంగిలించినట్లుగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన పోలీస్ సిబ్బంది నెల్లిమోహన్ వెంకట్ రెడ్డిలను ఎస్సై ఆవుల తిరుపతి అభినందించారు.

### గుండెపోటుతో మాజీ విద్యాధికారి భావన ఋషి మృతి

ఘన నివాళులు అర్పించిన మున్సిపల్ కౌన్సిలర్ శీలం శ్రీనివాస్



**జమ్మికుంట, ఆగస్టు 17 (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలోని కృష్ణ కాలనీకి చెందిన మాజీ విద్యాధికారి భావన ఋషి సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు అనంతరం ఇన్చార్జి విద్యాధికారిగా తన సేవలను అందించారు. సోమవారం ఉదయం తన పనులు తాను చేసుకుంటూ అటు ఇటు తిరిగిన భావన ఋషి ఒకసారిగా కుప్పకూలి పడిపోయారు దీనితో కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. భావన రుషి మృతి పట్ల పలువురు పూర్వ విద్యార్థులు సహచార సిబ్బంది కాలనీవాసులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భావన ఋషి విద్యారంగంలో అందించిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆకస్మిక మృతి బాధాకరమని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు శ్రీనివాస్ పేరు కొన్నారు. సాయంత్రం జమ్మికుంటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi మంగళవారం 18-8-2026

# రైలు కిందపడి వ్యక్తి మృతి



**జమ్మికుంట, ఆగస్టు 17 (సింగిడి):** ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గుల్లి సంపత్(50) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు భరించలేక సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంపత్ ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఒక సూసైడ్ నోట్ లో తన తల్లిదండ్రులతో పాటు తన తమ్ముడు ఇంటికి సంబంధించిన విషయంలో గత కొద్ది సంవత్సరాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని తాను చనిపోయిన తర్వాత నైనా ఆ ఇల్లును తన పిల్లలకు చెందేలా చేయాలంటూ సూసైడ్ రాసినట్లు రైల్వే పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య తన భర్త ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

# జమ్మికుంటలో నియోజకవర్గం స్థాయి బీఎల్ఏ-2ల సమావేశం

### సర్ ఫేజ్-2పై దిశా నిర్దేశం చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు



**జమ్మికుంట ఆగస్టు 17 (సింగిడి):** హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ ఫేజ్-2కి సంబంధించి బీఎల్ఏ-2ల తో సోమవారం రోజున బిజెపి ముఖ్య సమావేశం నిర్వహించింది.. ఈ సమావేశానికి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి ఓటర్ల జాబితా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై, ఫేజ్ 2 పై చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు.. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్చడం ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయడంపై రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలోజిల్లా ఇన్చార్జ్ హరి బాబుఎస్ఐఆర్ నియోజకవర్గ బీఎల్ఏ-1 పుప్పాల రఘుఎస్ఐఆర్ నియోజకవర్గ ఇన్చార్జ్ సీహెచ్. నరసింహరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నిర్మలా దేవి, మండల అధ్యక్షులు కొలకాని రాజు, దొంతరవేని రమేష్, తూర్పటి రాజు, పారుపెల్లి కొండాల్ రెడ్డి, ర్యాకం శ్రీనివాస్, బత్తిని నరేష్, బైరెడ్డి వెంకటరమణారెడ్డి వీరితో పాటు పలువురు మండల పదాధికారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


# నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

### 9 మంది అరెస్ట్.. 46 లీటర్ల నాటుసారా స్వాధీనం



**మహాముత్తారం/కాటారం/ మల్హర్, ఆగస్టు 17 (సింగిడి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. మహాముత్తారం, మలహార్‌రావు, కాటారం మండలాల్లోని పలు గ్రామాల్లో నాటుసారాయి తయారీ స్థావరాలపై సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. అసిస్టెంట్ కమీషనర్ వరంగల్ కె. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ హెచ్. దత్తురాజ్ గౌడ్, జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి. కిరణ్ ఆదేశాలతో కాటారం ఎక్సైజ్ స్టేషన్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ వరంగల్, జిల్లా టాస్క్‌ఫోర్స్, భూపాలపల్లి స్టేషన్ అధికారులు సంయుక్తంగా ఈ దాడులు చేపట్టారు. మహాముత్తారం మండలంలోని కోర్లకుంట, దొబ్బలపాడు, మలహార్‌రావు మండలంలోని ఎడ్లపల్లి, కొండంపేట, కాటారం మండలంలోని గంగారం, చింతకాని గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో మొత్తం 10 మందిపై కేసులు నమోదు చేసి, 9 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అధికారులు 46 లీటర్ల నాటుసారాయి, 20 కిలోల చక్కెర, 2 కిలోల డ్రై ఈస్ట్, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాటుసారాయి తయారీకి సిద్ధంగా ఉంచిన 1,250 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల్లో నాటుసారాయి వల్ల కలిగే అనర్థాలు, ప్రజల ఆరోగ్యం, కుటుంబాలపై పడే ప్రభావంపై అధికారులు అవగాహన కల్పించారు. నాటుసారాయి తయారు చేసినా, రవాణా చేసినా, కలిగి ఉన్నా లేదా విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో కాటారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బాదావత్ కిష్టయ్య, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాజ సమ్మయ్య, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు, చంద్రశేఖర్, భూపాలపల్లి ఎస్ఐ ఎస్‌కే. రబ్బానీతో పాటు హెడ్ కానిస్టేబుల్ గణేష్, కానిస్టేబుళ్లు కృష్ణ నాయక్, శ్రీనాథ్, హుస్సేన్, కుమార్ పాల్గొన్నారు.

# 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 17(సింగిడి) :** ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన ఘటనలో భూపాలపల్లి జిల్లా సీసీఎస్ పోలీసులు ఓ మహిళను అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో సీసీఎస్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో మొగుళ్లపల్లి మండలానికి చెందిన తూర్పాటి సమ్మక్కను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు నిందితురాలిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

### 50 లీటర్ల గుడుంబా స్వాధీనం

### ఇద్దరిపై కేసు నమోదు



**మహాముత్తారం, ఆగస్టు 17 (సింగిడి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిమ్మగూడెంలో గుడుంబా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో సివిల్ పోలీస్ సిబ్బంది, తెలంగాణ స్పెషల్ పోలీస్సి సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. ఇద్దరు నిందితుల వద్ద నుంచి సుమారు 50 లీటర్ల గుడుంబాతో పాటు, తయారీకి వినియోగించే బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దాడులు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు. అక్రమ మద్యం తయారీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులకు సత్వరం పరిష్కరించాలి

- 30 రోజులు దాటిన అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, ఆగస్టు17(సింగిడి):** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నిరంతరం పర్యవేక్షిస్తున్నందున 30 రోజులు దాటిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఎప్పటికప్పుడు అధికారిక నమోదులో పొందుపరచాలని ఆదేశించారు. పింఛన్ల దరఖాస్తుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారు ఎవరూ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని తెలిపారు. పాఠశాల విద్యార్థుల ఏకరీతి దుస్తుల పంపిణీలోనూ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

**పింఛన్ల దరఖాస్తులకు ఆహార భద్రత కార్డు ప్రామాణికం...**

చేయూత పింఛన్లకు సంబంధించి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గీత, మెప్మా ప్రాజెక్టు అధికారి స్వరూప రాణి మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్ మినహా ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు తదితర పింఛన్లకు ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలకు గ్రామీణ ప్రాంతాల్లో 35 ఏళ్లు, పట్టణ ప్రాంతాల్లో 40 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. కొత్త పింఛన్ల దరఖాస్తులకు ఆహార భద్రత కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నామని, గత నిబంధనలే కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రతి గ్రామపంచాయతీ, మండల కేంద్రం, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలో పింఛన్లకు సంబంధించిన సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో గ్రామసభలు, వార్డు సభలు, ప్రజాపాలన వారోత్సవాల్లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గతంలో పత్రాలు సమర్పించని వారు, దరఖాస్తు చేయని అర్హులు మాత్రం అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తిస్తారని తెలిపారు.

# ప్రసంగికి అవార్డుల వర్షం

### రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో.. డాన్స్ స్టూడియో విద్యార్థుల విజయకేతనం




**జమ్మికుంట, ఆగస్టు 17 (సింగిడి):** కరీంనగర్‌లోని కళాభారతి కరీంనగర్ బస్‌స్టాండ్ ఎదురుగా స్టార్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 16, 2026న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ చేపట్టారు ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ప్రసంగి డాన్స్ స్టూడియో ఉ ఫిట్‌నెస్ సెంటర్, జమ్మికుంట విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నృత్య కళాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్, ఆల్ స్టైల్స్ తదితర విభాగాల్లో సోలో, డ్యూయెట్, గ్రూప్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ వెస్ట్రన్ సోలో విభాగంలో అర్ల అశ్రిత ప్రథమ బహుమతి సాధించగా, సీనియర్ ఫోక్ సోలో విభాగంలో వి. భావన ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. అలాగే జూనియర్ వెస్ట్రన్ సోలో విభాగంలో పి. ప్రకృతి ద్వితీయ బహుమతి, జూనియర్ ఫోక్ సోలో విభాగంలో కె. రసగ్న ద్వితీయ బహుమతి సాధించారు. జూనియర్ ఫోక్ డ్యూయెట్ విభాగంలో కె. రసగ్న, పి. ప్రకృతి జంట ద్వితీయ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా ప్రసంగి డాన్స్ స్టూడియో డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. "ఇప్పటివరకు మా ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థులు 15 రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో, అలాగే 2 జాతీయ స్థాయి నృత్య పోటీల్లో విజయాలను సొంతం చేసుకోవడం మాకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. విద్యార్థులు ప్రతి పోటీలో తమ ప్రతిభను నిరూపించుకుంటూ వరుస విజయాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది" అని అన్నారు. "ఈ విజయాల వెనుక విద్యార్థులకు నిరంతరం శిక్షణ అందిస్తూ కృషి చేస్తున్న ప్రసంగి డాన్స్ మాస్టర్స్, ప్రసంగి, కె. రాజేష్ లకి ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమ పిల్లలను నిరంతరం ప్రోత్సహిస్తూ, పోటీలకు పంపిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రసంగి డాన్స్ స్టూడియోతో పాటు జమ్మికుంటకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల పట్ల స్టూడియో మాస్టర్లు, తల్లిదండ్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు అభినందనలు తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి దళితుల సమస్యలు తీసుకెళ్లాలి

### జేఏసీ చైర్మన్ పీక కిరణ్ విజ్ఞప్తి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 17 (సింగిడి) :** ఈ నెల 19న భూపాలపల్లి జిల్లాకు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రేణికుంట్ల ప్రవీణ్ రానున్న నేపథ్యంలో జిల్లాలోని దళితులు, దళిత సంఘాల నాయకులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని జేఏసీ చైర్మన్ పీక కిరణ్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్న సమీక్ష సమావేశంలో కమిషన్ చైర్మన్, సభ్యులతో పాటు పలువురు అధికారులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలతో పాటు జిల్లాలో దళితులపై జరుగుతున్న కుల వివక్ష, అంటరానితనం, వివక్షత ఘటనలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఆధిపత్య కులాల పెత్తనం, దళిత వర్గాలపై జరుగుతున్న అన్యాయాలు, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం, ఉదాసీనత వంటి అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు సమర్పించాలని పీక కిరణ్ కోరారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను కమిషన్ చైర్మన్, సభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల జిల్లా కన్వీనర్ అజ్మీర పూల్ సింగ్, జిల్లా కో-కన్వీనర్ రామగిరి రాజు పాల్గొన్నారు.

# న్యాయ అవగాహన సదస్సులు

### మొబైల్ వ్యాన్ ద్వారా విస్తృత ప్రచారం




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 17 (సింగిడి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ ద్వారా జంగేడు, ఖాసీంపల్లి గ్రామాల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోర్టు కేసుల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న వారు, న్యాయం పొందలేని నిస్సహాయులు, ప్రామిసరీ నోట్ వివాదాలు, కుటుంబ వివాదాలు, సివిల్ కేసులు తదితర సమస్యలతో బాధపడుతున్న వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. సూపరింటెండెంట్ రఘురామ్ మాట్లాడుతూ కేసుల్లో సాధ్యమైనంత వరకు రాజీ మార్గాన్ని అనుసరించి వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. సోదరభావంతో, వివాదాలకు దూరంగా జీవించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. న్యాయ సహాయం, సలహాల కోసం నల్సా టోల్‌ఫ్రీ నంబర్ 15100ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, వెంకటేష్, రాజ్‌కుమార్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## కాటారం కేజీబీవీలో వృక్ష సంరక్షణ కార్యక్రమం



**కాటారం, ఆగస్టు 17(సింగిడి) :** పర్యావరణ పరిరక్షణపై విద్యార్థినుల్లో అవగాహన కల్పించేందుకు కాటారం కేజీబీవీలో సోమవారం వృక్ష సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలోని తల్లి వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థినులు చెట్టును ఆలింగనం చేసుకున్నారు. అనంతరం మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చల్ల సునీత మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెట్లు ప్రాణవాయువును అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి మొక్కను నాటడంతో పాటు అది పెద్ద వృక్షంగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ప్రకృతి, పర్యావరణంపై అవగాహన, బాధ్యత పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ, నళిని, శిరీష, సుజాత, మణిమాల, అరుణ, రాజమణి, కవిత, శ్రీలత, స్వప్న, సరిత, మౌనిక, శ్రావ్య, లక్ష్మీ, రాజేశ్వరి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## తిరుపతి పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్చెరు, ఆగస్టు 17 (సింగిడి):** పటాన్చెరు పట్టణానికి చెందిన సీసాల రాజు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పటాన్చెరు--తిరుపతి పాదయాత్రను సోమవారం ఉదయం పట్టణంలోని మహంకాళి దేవాలయం వద్ద పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో వరుసగా 22 సంవత్సరాలుగా తిరుపతికి పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆధ్యాత్మిక విశ్వాసంతో చేపడుతున్న ఈ పాదయాత్ర విజయవంతంగా సాగాలని, యాత్రికులందరికీ శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం కిష్టారెడ్డిపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుపతి పాదయాత్రను కూడా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు సురక్షితంగా తిరుపతి చేరుకుని స్వామివారిని దర్శించుకోవాలని ఆకాంక్షించారు.

### 60 లక్షల రూపాయల రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 17(సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 279వ ముఠామేస్త్రి నగర్ డివిజన్ శ్రీరామ్ నగర్--బి రోడ్డు, ముఠామేస్త్రి నగర్ ప్రాంతాల్లో 8, 9, 10, 11, 12వ వీధుల్లో రోడ్ల దుస్థితి కారణంగా ప్రజల రాకపోకలకు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సిఎంసి నిధుల ద్వారా రూ. 60 లక్షల మంజూరు చేయించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం స్థానికులు స్థానిక పార్టీ ముఖ్య నేతల తో కలిసి రోడ్డుపనులకు కొలను హనుమంత రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, అజయ్, జమీర్ రహీమ్, కలీమ్, గఫార్, ఖాజా రెహ్మాన్ ఖలీల్, ఎం.డి. ఖలీల్ ఉర్ రెహ్మాన్, హనీఫ్, నవీన్ గౌడ్, యాదగిరి, బుచ్చి రెడ్డి, అంజనేయులు, నరసింహాచారి, విశ్వనాథ్, ప్రభాకర్, అజాజ్, శ్రావణ్, విష్ణువర్ధన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 17 (సింగిడి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి కథ బోనాల పండుగ జరుపుకుంటామని ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణం లోని ఊర ముత్యాలమ్మ, 48వ వార్డు కోట మైసమ్మ 16వ వార్డు బేచిరా గ్ మాదారం శ్రీ ముత్యాలమ్మ ఒకటో వార్డు లోని ముత్యాలమ్మ రెండో వార్డులోని ముత్యాలమ్మ దేవాలయాలను మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న తో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం మొదటి వారంలో జరిగే బోనాల పండుగకు ఎంతో విశిష్టత దాగి ఉందని పూర్వీకుల నుండి బోనాల పండుగ ఆనవాయితీగా తెలంగాణ ప్రజలు జరుపుకుంటారని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్ జిల్లా యువజన అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ మాజీ జెడ్పిటిసి చింతమల రమేష్ అబ్దుల్ రహీం కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి మన్యం అరుణ మల్లేష్ గుణగంటి హేమ సతీష్ కోడి శిరీష జహీర్ తన్వీర్ మణిరత శ్రీనివాస్ దండు మైసమ్మ దేవాలయం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి ఇతరులు పాల్గొన్నారు.



# జిమ్‌కు వెళ్లలేకపోతున్నారా?



ప్రస్తుత కాలంలో బిజీ జీవనశైలి కారణంగా చాలామందికి జిమ్‌కు వెళ్లడం లేదా ప్రత్యేకంగా వ్యాయామం చేయడానికి సమయం దొరకడం లేదు. అయితే ఆరోగ్యంగా ఉండాలంటే గంటల తరబడి వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు. రోజువారీ జీవితంలో చేసే చిన్నపాటి శారీరక కార్యకలాపాలు కూడా శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అలాంటి సులభమైన, ప్రభావవంతమైన వ్యాయామాల్లో మెట్లు ఎక్కడం ఒకటి. ఎలాంటి ప్రత్యేక పరికరాలు లేకుండా ఎక్కడైనా చేయగలిగే ఈ వ్యాయామం శరీరాన్ని చురుకుగా ఉంచడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**గుండె ఆరోగ్యానికి మేలు**


మెట్లు ఎక్కడం ఒక మంచి కార్డియో వ్యాయామంగా పనిచేస్తుంది. ఇది గుండె వేగాన్ని పెంచి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా మెట్లు ఎక్కడం వల్ల గుండె పనితీరు మెరుగై గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది. మెట్లు ఎక్కే సమయంలో తొడలు, మోకాళ్ల చుట్టూ ఉన్న కండరాలు, తుంటి భాగం, పిరుదుల కండరాలు ఎక్కువగా పనిచేస్తాయి. దీంతో కండరాల బలం, ఓర్పు పెరిగి శరీర సమతుల్యత కూడా మెరుగుపడుతుంది.

**కేలరీలు వేగంగా ఖర్చవుతాయి**

సాధారణంగా నడకతో పోలిస్తే మెట్లు ఎక్కడం ద్వారా ఎక్కువ శక్తి వినియోగించబడుతుంది. దీంతో అధిక కేలరీలు ఖర్చై బరువు నియంత్రణలో ఉండటానికి సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి వ్యాయామంగా భావిస్తారు. రోజూ మెట్లు ఎక్కడం వల్ల గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడి శరీరానికి ఎక్కువ స్టామినా వస్తుంది. దీనివల్ల రోజువారీ పనులను అలసట లేకుండా చేయగలుగుతారు.

**ఎముకల ఆరోగ్యం**

మెట్లు ఎక్కడం బరువు మోసే వ్యాయామం (ఔవఅస్త్రష్ట్ర-దీఘుతీఱఅస్త్ర జుఞవతీఎఱంవ) కాబట్టి ఎముకల సాంద్రతను కాపాడుకోవడంలో సహాయపడుతుంది. దీర్ఘకాలంలో ఎముకల బలాన్ని పెంచడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. మోకాళ్ల నొప్పులు, కీళ్లవాతం, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు, తరచూ తల తిరిగే సమస్య ఉన్నవారు లేదా ఇటీవల శస్త్రచికిత్స



చేయించుకున్నవారు వైద్యుల సలహా తీసుకున్న తర్వాత మాత్రమే మెట్లు ఎక్కే వ్యాయామం చేయాలి. వృద్ధులు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.



**మెట్లు ఎక్కేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు**

వ్యాయామాన్ని మొదట నెమ్మదిగా ప్రారంభించి క్రమంగా వేగాన్ని పెంచాలి. జారిపోని మంచి పట్టు ఉన్న బూట్లు ధరించడం మంచిది. అవసరమైతే మెట్ల రెయిలింగ్‌ను పట్టుకుని ఎక్కాలి. వ్యాయామం చేస్తున్న సమయంలో ఛాతీ నొప్పి, తీవ్రమైన ఆయాసం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆపి వైద్యుడిని సంప్రదించాలి. సరైన విధంగా, క్రమం తప్పకుండా మెట్లు ఎక్కడం ద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శరీర ఫిట్‌నెస్, కండరాల బలం, బరువు నియంత్రణ వంటి అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# బెల్లం పాకం కూర తింటే ..?

రక్తం తక్కువగా ఉన్నవాళ్లు మందులు వాడేకన్నా ఇలా కూర చేసుకుని తింటే ఆ సమస్య నుంచి ఉపశమనం పొందుతారు. ఇది వరకు రోజుల్లో దీనిని ఎక్కువగా తినేవాళ్ళు. ఇది ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. రుచిగా కూడా ఉంటుంది. దీనిని ఎలా తయారు చేయాలో ఇక్కడ చదివి తెలుసుకుందాం..





**చిలకడ దుంప బెల్లం పాకానికి కావలసిన పదార్థాలు:**

అరకిలో చిలకడదుంపలు, పావుకిలో బెల్లం, అర కప్పు నీరు, రెండు టేబుల్ స్పూన్స్ నెయ్యి, అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి , కొద్దిగా తురిమిన కొబ్బరి, 10 జీడిపప్పు, 10 కిస్మిస్, ఒక కప్పు నువ్వులను తీసుకోవాలి. దీనిని సరైన కొలతలతో చేస్తే మంచి రుచి వస్తుంది.

**చిలకడ దుంప బెల్లం పాకం తయారీ విధానం :**

ముందుగా చిలకడదుంపలను తీసుకుని ఒకటికి రెండు సార్లు బాగా కడిగి దీనిని ఉడికించాలి లేదంటే వీటిని ఆవిరిలో కొద్దిగా ఉడికించాలి. ఆ తరవాత ఇవి చల్లారిన తర్వాత వీటి తొక్క తీసి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.

**చిలకడ దుంప బెల్లం పాకం తయారీ విధానం**

**స్టెప్ 1 :** ఇప్పుడు ఒక గిన్నె గ్యాస్ పొయ్యి మీద పెట్టి దానిలో బెల్లం, అర కప్పు నీళ్లు పోసి దీనిలో వేసే బెల్లం మొత్తం కరిగే వరకు దీనిని బాగా వేడి చేయాలి. ఇలా అయ్యాక ఈ బెల్లం పాకాన్ని వేరు వేసి మళ్ళి ఇంకో సారి మళ్లీ స్టవ్‌పైన పైన పెట్టి వేడి చేయాలి. ఇలా చేస్తే కొద్దిగా గట్టిపడుతుంది.

**చిలకడ దుంప బెల్లం పాకం తయారీ విధానం**

**స్టెప్ 2 :** ఇక ఇప్పుడు ఇది చిక్కబడిన తర్వాత దీనిలో ఉడకబెట్టుకున్న చిలకడదుంప ముక్కలను వేసి మిక్స్ అయ్యేలా కలపాలి. చివర్లో కొద్దిగా యాలకుల పొడి, ముందుగా పక్కన పెట్టుకున్న కొబ్బరిని 4 నిమిషాలు పాటు ఉడికించాలి. చిన్న పాన్‌లో 10 జీడిపప్పు, కిస్మిస్ లు పాకంలో వేయాలి. అంతే, చిలకడ దుంప బెల్లం పాకం రెడీ.

# అప్పట్లో ఈ పలావ్ కోసం గంటల తరబడి వెయిట్ చేసేవాళ్లు..



అప్పట్లో ఈ పలావ్ కోసం చాలా దూరం వెళ్ళి తినేవాళ్లు. ఏదైనా పండుగ వస్తే రైతుల ఇంట్లో ఇప్పటికీ ఫుల్ ట్రెండింగ్ దీనిని అంత బాగా తింటారు. ఈ పల్లెటూరి స్టైల్ పలావ్ ఒకప్పుడు మారు మోగింది. మరి, అసలు లేట్ చేయకుండా దీనికి కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ చదివి తెలుసుకుందాం..

**గుత్తి వంకాయ పలావ్ రెసిపీకి కావలసిన పదార్థాలు:**


రెండు కప్పుల బాస్మతి బియ్యం, గుత్తి వంకాయలు 10, రెండు ఉల్లిపాయలు , 4 పచ్చిమిర్చి , ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, పావు కప్పు పెరుగు, అర కప్పు పుదీనా, అర కప్పు కొత్తిమీర , మూడు టేబుల్ స్పూన్స్ నెయ్యి , మూడు టేబుల్ స్పూన్స్ నూనె, రుచికి సరిపడా ఉప్పును తీసుకోవాలి.

**గుత్తి వంకాయ పలావ్ స్టఫింగ్ మసాలా:**

పావు కప్పు వేరుశెనగలు, రెండు టేబుల్ స్పూన్స్ నువ్వులు, రెండు టేబుల్స్ స్పూన్స్ ఎండుకొబ్బరి , ఒక టేబుల్ స్పూన్ ధనియాలు , 10 ఎండుమిర్చి , ఒక టేబుల్ స్పూన్ కారం, అర టీ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ గరం మసాలా, ఇంకా కొద్దిగా చింతపండు గుజ్జు , రుచికి సరిపడా ఉప్పును తీసుకోవాలి.

**గుత్తి వంకాయ పలావ్ తయారీ విధానం:**

ముందుగా 10 గుత్తి వంకాయలను తీసుకుని బాగా కడిగి పక్కన పెట్టుకోవాలి. దీనిని చేసే రీతిలో చేస్తే రుచి పెరుగుతుంది. దీనిలో వేసే



స్టఫింగ్ మసాలానే రుచి, మంచి సువాసనను ఇస్తుంది. ఆ తర్వాత బాస్మతి బియ్యాన్ని తీసుకుని 30 నిమిషాలు పాటు నానబెట్టికోవాలి. వంకాయలను కొద్దిగా వేయించాలి

**గుత్తి వంకాయ పలావ్ తయారీ విధానం స్టెప్ 1 :**

ఇంకా దీనిలో పుదీనా, కొత్తిమీర వేస్తె పలావ్‌కు మంచి రుచి వస్తుంది. ఇంకా చివర్లో మాసాలాలు వేసి 10 నిమిషాలు ఉంచితే పల్లెటూరి స్టైల్ రుచి వస్తుంది. ఈ పలావ్‌ను ఉల్లిపాయ రాయితాతో తింటే మంచి టేస్ట్ వస్తుంది. ఇంకా దీన్లో నెయ్యి వేస్తే పలావ్ రుచి రెట్టింపు అవుతుంది.

## గోపీచంద్ అకాడమీతో చుప్స్ ఫుట్‌వేర్ ఒప్పందం

**హైదరాబాద్, (సింగిడి):** చుప్స్ ఫుట్‌వేర్ పి. గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీతో ఏడాది కాలానికి 'అధికారిక ఫుట్‌వేర్ రికవరీ భాగస్వామి'గా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా పుల్లెల గోపీచంద్, చుప్స్ వ్యవస్థాపకుడు యశేష్ ముఖి మాట్లాడుతూ.. క్రీడాకారుల అభిప్రాయాల ఆధారంగా రికవరీ ఫుట్‌వేర్‌ను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా అకాడమీలో బ్రాండింగ్, అథ్లెట్ల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఉత్పత్తుల అభివృద్ధి చేపట్టనున్నట్లు వెల్లడించారు.



## ఈ20 పెట్రోల్‌తో మైలేజీ తగ్గేమాట వాస్తవమే కానీ: కేంద్రం

**దిల్లీ:** 20 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల కొన్ని వాహనాలలో మైలేజీ తగ్గే మాట వాస్తవమే అని కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ అంగీకరించింది. అదే సమయంలో అధిక ఆక్టేన్ రేటింగ్, అధిక పికప్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి ప్రయోజనాలను విస్మరించకూడదని పేర్కొంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ ప్రోగ్రామ్‌పై విమర్శలు వస్తున్న వేళ చమురు మంత్రిత్వ శాఖ 'సందేహాలు - సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది.




**తొందరపాటు కాదు**

ఈ20 పెట్రోల్ వినియోగాన్ని ఆగమేఘాల మీద అమల్లోకి తెచ్చారన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు కేంద్రం పేర్కొంది. 2001లో పైలట్ ప్రాజెక్ట్ లాంచ్ అవ్వగా.. 2006 నాటికి దేశంలోని పలు చోట్ల 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని తెలిపింది. 2022 నాటికి 10 శాతానికి, 2025-26 నాటికి 20 శాతం బ్లెండింగ్‌ను దశలవారీగా సాధించగలిగామని తెలిపింది.

**పాత వాహనాలు పాడవుతాయా?**

పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపై స్పందిస్తూ.. దేశవ్యాప్త వినియోగానికి ముందు ఈ20 వాహనం ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, ఉద్గారాలకు సంబంధించి విస్తృతమైన పరీక్షలకు నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రియల్ వరల్డ్ కండీషన్‌లో ఈ20 వల్ల తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం వంటివేవీ సర్వీస్ చేసిన వాహనాల్లో నిరూపితం కాలేదని పేర్కొంది. మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్ కంపెనీల అభిప్రాయాలనూ ఉటంకించింది.

**వేర్వేరు సాధ్యం కాదు..**

పెట్రోల్ రకాన్ని వినియోగదారులు ఎంచుకునేలా ప్యూర్, ఈ10, ఈ20 ఇంధన ఆప్షన్లు ఇవ్వాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని తెలిపింది. దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని వివరించింది.

**ధర ప్రస్తావన**

ఈ20 పెట్రోల్ ధర గురించి స్పందిస్తూ.. రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం పేర్కొంది. ఒకవేళ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ20 పెట్రోల్ ధరనే.. సాధారణ పెట్రోల్ ధర కంటే కాస్త ఎక్కువగా ఉంటుందని తెలిపింది. కాబట్టి సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని పేర్కొంది.

**రూ. 1.97 లక్షల కోట్లు ఆదా**

ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల రూ. 1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలతో వివరించే ప్రయత్నం చేసింది. 2014-15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ. 1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని పేర్కొంది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.

## భారీ లాభాలతో ముగిసిన సూచీలు.. 24,200 పైకి నిఫ్టీ

**స్టాక్ మార్కెట్** Stock Market

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. దీంతో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే దాదాపు రూ. 6 లక్షల కోట్లు పెరిగి రూ. 482 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 77,395.63 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,741.82) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,642.23 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 827.57 పాయింట్ల లాభంతో 77,569.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 244.10 పాయింట్ల లాభంతో 24,206.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.31గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, టెక్ మహీంద్రా, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.17 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్సు 4,108




డాలర్ల వద్ద కొనసాగుతోంది. షాంఘై మినహా ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ట్రేడింగ్‌ను ఆరంభించాయి.

## ఆల్కహాల్ కలిసిన మందులకూ చీటీ తప్పనిసరి

**దిల్లీ:** ఆల్కహాల్ కలిగిన ఔషధాల విక్రయానికి సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా




విక్రయించడానికి వీల్లేదని స్పష్టంచేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ ఎ1 పరిధిలోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

కొన్ని రకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో వాటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు రాష్ట్రాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (ణుూదీ), డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ (ణజజ) సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. దీనివల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి.

## జెరోదా vs గ్రో.. నితిన్ కామత్ పోస్ట్‌తో 'ఎక్స్' వార్

ఆన్‌లైన్ పెట్టుబడి సంస్థల్లో ట్రేడింగ్ ఛార్జీల విధానాల విషయంలో.. దేశంలోని రెండు ప్రధాన బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్‌ల మధ్య బహిరంగ వాగ్వాదం నెలకొంది. ఈ అంశంపై జెరోదా సీఈఓ నితిన్ కామత్ 'ఎక్స్'లో స్పందిస్తూ.. 'గ్రో'పై పరోక్ష విమర్శలు గుప్పించారు. దీంతో 'గ్రో' కూడా దీటుగా బదులిచ్చింది. ఇంతకీ వివాదం ఏంటంటే..? మ్యూచువల్ ఫండ్స్ ట్రేడింగ్ విధానాలపై నితిన్ కామత్ స్పందిస్తూ.. "2010లో మేం డిస్కౌంట్ బ్రోకరేజీని ప్రారంభించినప్పుడే.. ఇన్వెస్టర్ల పెట్టుబడి మొత్తం చిన్నదా.. పెద్దదా అనే సంబంధం లేకుండా స్థిరమైన ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాం. ఒక లావాదేవీని పూర్తి చేయడానికి మేం చేసే పని ఒకేలా ఉన్నప్పుడు.. కస్టమర్లు ఎందుకు విభిన్న రుసుములు చెల్లించాలనేదే మా ఉద్దేశం. కస్టమర్లు పెద్దమొత్తాల్లో పెట్టుబడి పెట్టినంత మాత్రాన.. ట్రేడింగ్ విధానంలో ఎలాంటి అదనపు శ్రమ ఉండదు. ఇదే లాజిక్‌ను మేం మ్యూచువల్ ఫండ్స్‌కు కూడా అమలు చేస్తున్నాం. అందుకోసమే ప్రత్యేకంగా కాయిన్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. లావాదేవీలపై పర్సంటేజీ విధానంతో ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు దాన్ని డిస్కౌంట్ బ్రోకరేజీ అని అనరు. ఇక, మాతో పాటే మ్యూచువల్ ఫండ్ ప్లాట్‌ఫామ్స్‌ను ప్రారంభించిన కంపెనీలు ఇప్పుడు కన్పించకుండా పోయాయి. లేదా కొత్త రంగాన్ని ఎంచుకున్నాయి. ఇంకొన్ని కంపెనీలు




కస్టమర్లను ఆకట్టుకునేందుకు కొత్త కొత్త ఆఫర్లు ప్రకటిస్తున్నాయి" అని నితిన్ కామత్ రాసుకొచ్చారు. ఇందులో ఎక్కడా ఆయన 'గ్రో' పేరును నేరుగా ప్రస్తావించలేదు. అయితే, ఇటీవల ఈ కంపెనీ మ్యూచువల్ ఫండ్స్ కోసం 'ప్రైమ్' సేవలను తీసుకురావడంతో నితిన్ కామత్ దాన్నుద్దేశించే పోస్ట్ చేశారని నెటిజన్లు చర్చించుకున్నారు. ఈ క్రమంలోనే 'గ్రో' స్పందిస్తూ కామత్‌కు కౌంటర్ ఇచ్చింది. "మా ఆఫర్లపై తప్పుడు సమాచార వ్యాప్తి జరుగుతోంది. 'ప్రైమ్' అనేది ఇన్వెస్టర్ల కోసం మా కంపెనీ తీసుకొచ్చిన అధునాతన ఫీచర్ మాత్రమే. ఏవి కొనాలి, ఏవి అమ్మాలి అనే దానిపై ఇన్వెస్టర్లకు గైడెన్స్ ఇచ్చే వేదిక. అంతేగానీ, మా ప్లాట్‌ఫామ్‌లో ఎలాంటి మార్పుల్లేవు. ప్లాన్లు, ఛార్జీలు అన్నీ గతంలో ఉన్నవే. కొందరు ఇన్వెస్టర్లు సొంతంగా ట్రేడింగ్ చేసుకోగలరు. మరికొందరికి గైడెన్స్ అవసరం. వారందరికీ సేవలందించేందుకే కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చాం" అని గ్రో వివరణ ఇచ్చింది.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
SINGIDI తెలుగు దినపత్రిక
Singidi మంగళవారం 18-8-2026

## జిల్లా వ్యవసాయ శాఖకు ఉత్తమ పురస్కారం



**గద్వాల బ్యూరో, (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ పని తీరుకు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం లభించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన వేడుకల్లో జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ తరపున తాను రాష్ట్రస్థాయి ఉత్తమ పనితీరు అవార్డును రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు గోపి చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. జిల్లాలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల కృషి వలన ఈ గుర్తింపు సాధ్యమైందని తెలిపారు. ఇకముందు కూడా తమ అధికారులు, సిబ్బంది రెట్టింపైన ఉత్సాహంతో, బాధ్యతతో పని చేసి రైతుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## బాలకృష్ణ మృతదేహానికి కాంగ్రెస్ నేతల నివాళులు



**అశ్వాపురం, (సింగిడి):** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామం ఎస్సీ (సర్వయ్యగుంపు) కాలనీకి చెందిన కాసర్ల బాలకృష్ణ శనివారం మృతి చెందాడు విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు ఆదివారం బాలకృష్ణ నివాసానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాలకృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, మల్లెలమడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు, ఆవుల రవి, గొల్లపల్లి నరేష్, బచ్చలకూరి వెంకట్, వంగూరి మధు, బొడ్డు సైదులు, బొడ్డు కృష్ణ, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు



**కల్వకుర్తి, (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోనీ జులపల్లి గ్రామ పంచాయతీలోనీ జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ శ్రీశైలం గౌడ్, వార్డు సభ్యులు జగదీష్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, నాగయ్య, శివ, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వర్షకాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను ఛైర్మన్ సుశీకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరతకు అవకాశం.. జూరాల నీటిని పొదుపుగా వినియోగించాలి

### వరికి బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి



**గద్వాల బ్యూరో (సింగిడి)::** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి. కేశవరావు అన్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో పర్యవేక్షక ఇంజనీర్ డి. కేశవరావు ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ అధికారులు, కార్యనిర్వా హక ఇంజనీర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. రైతుల పంటల అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లో సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగు చేయవద్దని సూచించారు. జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గిన వెంటనే ముందస్తు చర్యగా కాలువలను మూసివేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం నీటి ప్రవాహాన్ని అంచనా వేసి సాగునీటిని క్రమపద్ధతిలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీరు ఆయకట్టు పరిధిలోని గ్రామాలు, మండలాల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైతులు సాగునీటిని అవసరానికి అనుగుణంగా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో జూరాలకు సరిపడా నీటి ప్రవాహం వచ్చినట్లయితే అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించి కాలువలకు సాగునీటి విడుదలపై తదుపరి చర్యలు తీసుకుంటామని పర్యవేక్షక ఇంజనీర్ డి. కేశవరావు తెలిపారు. ఈ సమావేశంలో ఇంజినీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్లు పెట్టి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

### బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్



**మధిర, (సింగిడి):** మధిర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత మధిర బిఆర్ఎస్ పార్టీనియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజ్ మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతుంది. గతంలో మధిర అంటే గొప్ప పేరు ఉండేది. ఇప్పుడు మధిరకు మంచి పేరు లేదు. నియోజకవర్గంలో నాయకుడికి డబ్బులు వచ్చే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోడ్ల వెడల్పు పేరుతో అడ్డగోలుగా ధ్వంసం చేస్తున్నారు. సామాన్యుల ఆస్తులను మాత్రం పడగొడుతు న్నారు. రోడ్డుకు దగ్గరగా ఉన్న కాంగ్రెస్ ఆఫీసును ఎందుకు తొలగించడం లేదు. మధిరలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం పంట పొలాలను 260 ఎకరాలను రైతుల దగ్గర తీసుకు నేందుకు 193 కోట్లు కేటాయించారు. ఈ ఔటర్ రింగ్ రోడ్డు కనుక అయితే మధిరలో వ్యాపా ర వాణిజ్య సంస్థలు పూర్తిగా మూతపడతాయి. రింగు రోడ్డు పేరుతో రైతుల భూము లను అతి తక్కువ ధరలకు తీసుకుంటే బి ఆర్ ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుంది. ఔటర్ రింగ్ రోడ్డు ఎందుకోసమో డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలి. నిజంగా మీకు అభివృద్ధి చేయా లని తపన ఉంటే సిరిపురం నుండి మధిర వరకు, దెందుకూరు నుండి మధిర వరకు, రాయపట్నం నుండి మధిర వరకు డివైడర్లు పెట్టి సెంటర్ లైటింగును ఏర్పాటు చేయాలి. ఈ అభివృద్ధి మధిర కోసమేనా లేక మీకోసమేనా చెప్పాలి. బి ఆర్ఎస్ పాలనలోనే మధిర అభివృద్ధి. మేము చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు మేము చేసాము అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2వ విడత ఎస్ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు

### నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి





**కల్వకుర్తి ఆగస్టు 16 (నినాదం):** కల్వకుర్తి పట్టణం గ్రామీణ ప్రాంత యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలవాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని తహశీల్దార్ ఆఫీస్ ఎదురుగా పాత కృష్ణవేణి జూనియర్ కాలేజ్ బిల్డింగ్ లో నిర్వహిస్తున్న ఎస్ ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ 2వ బ్యాచ్‌నుఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈరోజు ప్రారంభించారు, ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఒక విద్యార్థి జీవితంలో ఉద్యోగం ఎంత ముఖ్యమో ప్రతి యువత గుర్తించాలన్నారు, ఉద్యోగం సాధించడం అంటే కేవలం నెలవారీ జీతం పొందడం మాత్రమే కాదని.. అది ఒక యువకుడి జీవితానికి స్థిరత్వం, కుటుం బానికి ఆర్థిక భరోసా, తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం తీసుకువచ్చే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖలో ఉద్యోగాల భర్తీకి అవకాశం కల్పిస్తూ ఎస్ ఐ కానిస్టేబుల్ తదితర విభాగాల్లో మొత్తం 7 వేలకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయడం పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఒక గొప్ప అవకాశమని తెలిపారు, అవకాశం వచ్చినప్పుడు సిద్ధం కావడం కాదు.. అవకాశం రాకముందే సిద్ధంగా ఉండాలి అనే ఉద్దేశంతోనే ఈ ఉచిత శిక్షణను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చిన ఈ సమయంలో యువత సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి శారీరక దారుఢ్యంతో పాటు రాత పరీక్షకు కూడా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎస్ ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ మొదటి బ్యాచ్‌ను విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందని, ఆరు మండలాల్లో మొదటి బ్యాచ్ ద్వారా గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ, పరీక్షల ద్వారా నిరంతర ప్రాక్టీస్, మార్గదర్శకత్వం అందించామని తెలిపారు, మొదటి బ్యాచ్ ఇచ్చిన అనుభవం, విద్యార్థుల నుంచి వచ్చిన స్పందన ఆధారంగా ఇప్పుడు మరింత మెరుగైన ప్రణాళికతో కల్వకుర్తిలో రెండో బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు, గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ ఉన్న ప్రతి యువకుడికి సమానమైన అవకాశం లభించాలన్నదే తన లక్ష్యమని, ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారి ఏ ఒక్క విద్యార్థి కూడా తన ఉద్యోగ కలను వదులుకోకూడదని.. ప్రతిభ ఉన్న యువతకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించి వారిని ఉద్యోగ సాధన దిశగా నడిపించాలనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు, యువతకు కేవలం పోలీస్ ఉద్యోగ శిక్షణ మాత్రమే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, శిక్షణ, మార్గదర్శకత్వం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నదే తన ప్రయత్నమని చెప్పారు, మీ కలను మీరు నమ్మండి. మీ సామర్థ్యాన్ని మీరు నిరూపించుకోండి.. మీ విజయానికి అవసరమైన సహకారం అందించేందుకు మా ఐక్యత ఫౌండేషన్ సేవలు ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటాయి అంటూ విద్యార్థులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు మాట్లాడుతూమా లాంటి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే అవకాశం కల్పించడం చాలా గొప్ప విషయం, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి లేకుండా.. పూర్తిగా ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందిస్తున్నందుకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు. మా కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మా భవిష్యత్తు కోసం ఇలాంటి గొప్ప అవకాశం కల్పించడం మాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది, మాపై నమ్మకం ఉంచి.. మా కలలను సాకారం చేసుకునే దిశగా మాకు అండగా నిలుస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, మాజీ కౌన్సిలర్ బోజి రెడ్డి, అధ్యాపకులు మోహన్ లాల్, ఫౌండేషన్ సభ్యులు యూసుఫ్ బాబా, గణేష్, శేఖర్, శ్రీపతి, శ్రీను లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మొండికుంటలో ముత్యాలమ్మ తల్లి బోనాల సందడి

### అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు.. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లింపు






**అశ్వాపురం, (సింగిడి):** మం డల పరిధిలోని మొండికుంట గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామపం చాయతీ తరపున ముందుగా ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన వస్త్రా లను సమర్పించారు. అనంతరం గ్రామం లోని మహిళలు, చిన్నారులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలను సమర్పించి అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకు న్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా కొందరు భక్తులు పోతురాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ ఆచార సంప్రదాయాల ప్రకారం కోళ్లు, మేకలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. మహిళలు బోనాలతో తరలిరావడంతో గ్రామ వీధులు సందడిగా మారాయి. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలం దరూ ఆయురారోగ్యాలతో జీవిం చాలని భక్తులు ముత్యాలమ్మ తల్లిని వేడుకు న్నారు. సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ.. ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో మొండికుంట గ్రామం సుభిక్షంగా ఉండాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచే భక్తుల కోరికలు నెరవేరాలని, గ్రామంపై ముత్యాలమ్మ తల్లి కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. గ్రామస్తులు, మహిళలు, యువత, చిన్నారులు పాల్గొనడంతో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

## పరీక్షల్లో ప్రతిభ.. విద్యార్థులకు నగదు పురస్కారం



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపినవిద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు. వనపర్తి మండలంకడుకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందినముసలి బాలరాజు తల్లిదండ్రులైన ముసలి కొండన్న, ముసలి శంకరమ్మల జ్ఞాపకార్థం2025-26 పబ్లిక్ పరీక్షల్లో టాప్ గా నిలిచిన మొదటి 5 మంది విద్యార్థులకురూ. 2000 చొప్పున, మిగతా 21 మంది విద్యార్థులకు రూ. 1500 చొప్పున మొత్తం రూ. 41, 500 నగదు పురస్కారాన్ని స్వాతంత్ర దినోత్సవ వేడుక వేడుకలసందర్భంగా అందజేసినట్లు పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండలవిద్యాశాఖ అధికారి మద్దిలేటి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, గ్రామ సర్పంచు తిరుపతయ్య, ఉప సర్పంచ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఇందిరమ్మ, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## కల్తి రమకు రూ,40వేలు ఆర్థిక సహాయం చేసిన ఆదివాసీ హెల్ప్ లైన్



**ఇల్లందు, (సింగిడి):** ఇల్లందు మండలం మామిడిగుం డాల నివాసి కల్తి రమ, రామయ్య దంపతులు ఇటీవల మహబూబా బాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం వెళ్లి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో లారి గుద్ది రమ తీవ్రంగా గాయాలపాలైంది. లారీ ప్రమాదంలో కుడికాలు తొడభాగం నుండి పాదం వరకు కండరం దెబ్బతిని, ఎడమ కాలు విరిగింది. కుడి కాలు ప్లాస్టిక్ సర్జరీ, ఎడమ కాలు ఆపరేషన్ కు 7 లక్షల వరకు ఖర్చు అవుతుందని సహాయం చేయవలసిందిగా రమ భర్త కల్తి రామయ్య ఆదివాసీ హెల్ప్ లైన్ ఇల్లందు వారిని సంప్రదించగా ఆదివాసీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు మొదలగు వారు స్పందించి విరాళాలు అందజేశారు. అలా సమకూర్చిన 40,000 రూపాయలను ఈ రోజు కల్తి రమ భర్త రామయ్యకు ఇల్లందు కొమరం భీం కాలనీలో హెల్ప్ లైన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హెల్ప్ లైన్ వ్యవస్థాపకులు కబ్బాకుల రవి, హెల్ప్ లైన్ అధ్యక్షులు కుర్సం అంజయ్య, ఉపాధ్య క్షులు చాపల రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు కొడెం కృష్ణయ్య, మోకాళ్ళ మోహన్ రావు, పూణెం బాలరాజు, హెల్ప్ లైన్ సభ్యులు దాతలు సూర్ణపాక స్వరూప, పాయం స్వరూప, ఎట్టి సుధీర్, సరియం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గట్టుసింగారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

### కేజీబీవీ మురుగునీటితో నరకయాతన పడుతున్న కాలనీ వాసులు



**కూసుమంచి, (సింగిడి):** గట్టుసింగారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని బీజేపీ జిల్లా నాయకులు, టిడబ్ల్యూ ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ గుండా ఉపేందర్‌రెడ్డి అధికారులను కోరారు. ఆదివారం లగిశెట్టి వీరబాబు, షేక్ అలీ ఆధ్వర్యంలో ఆయన కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ప్రధానంగా డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్ల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి దూరంగా కాలనీ ఉండటంతో తమ సమస్యలను పట్టించుకునే వారు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేజీబీవీ నుంచి వెలువడుతున్న మురుగునీరు నేరుగా డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ముందు నుంచి ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని తెలిపారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి, కాలనీ వాసులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 కుటుంబాలు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం విచారకరమని గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు. కేజీబీవీ నుంచి వస్తున్న మురుగునీటిని కాలనీకి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించాలని, అలాగే కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని అధికారుల ను డిమాండ్ చేశారు. పర్యటనలో బీజేపీ యువమోర్చా నాయకులు మంద చంద్రశేఖ ర్‌గౌడ్, స్థానికులు బొజ్జ రమేష్, గుంటూరు రమేష్, పావురాల శీను, కదారి జ్యోతి, లోడిగ జానయ్య, బి. లలిత, రెడ్డబోయిన లింగమ్మ, ధారా కుమార్ పాల్గొన్నారు.

## 17 నుంచి మండల స్థాయిలోనూ ప్రజావాణి

### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.




**గద్వాల బ్యూరో (సింగిడి):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలోనే కాకుండా ఈనెల 17వ తేదీ నుంచి మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్ర మాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినం దున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా సంబం ధిత మండలాల అన్ని శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్ర మంలో పాల్గొంటారన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించే మం డల స్థాయి ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పించ వచ్చన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులను సంబంధిత అధికారులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరిస్తారన్నారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలకే కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం లేకుండా ఆయా మండలాల్లోనే ప్రజలు తమ సమస్యలను పరిష్కరిం చుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సంబంధిత మండలాధికారులు మండల స్థాయి ప్రజావాణికి సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాల్సిం దిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## కల్దుర్కిలో ఘనంగా వాజ్ పేయి వర్ధంతి



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజకీయాల్లో నవశకానికి నాంది పలికి, దార్శనిక నాయకత్వంతో దేశ పురోగతికి బాటలు వేసిన మహనీయుడు వాజ్ పేయి అని కొనియాడారు. దేశాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు వాజపేయి చేసిన కృషి మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జ్యోతి శంకర్, బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు న్యాలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు లచ్చప్ప, భాస్కర్ రెడ్డి, రాజన్న, గంగా కిషన్, చంద్రకాంత్, రామ్ జీ, మల్లు గోండ, అశోక్, రాజు, కార్యకర్తలు అశోక్ పటేల్, రాములు, చందు, సాయిలు, మాధవరావు సాయి, రాచప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** బోధన్ జిల్లా ఆస్పత్రిలో రోటరీ క్లబ్ బోధన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరాజు, అల్లే రమేష్ మాట్లాడుతూరక్తదానం చేయండి -- ప్రాణాలను కాపాడండి అనే సందేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, కిషన్, సురేష్, విగ్నేశ్వర్, వినయ్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన మరిపెడ

### - వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుక...

### ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ , మున్సిపాలిటీ చైర్ పర్సన్ ప్రగతిశ్రీపాల్ రెడ్డి









**డోర్నకల్ /మరిపెడ (సింగిడి):** తెలంగాణలో ఆషాఢ లేదా శ్రావణ మాసంలో గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతోనిర్వహించే ప్రముఖ గ్రామదేవత పండుగ ముత్యాలమ్మ తల్లి బోనాలు. వర్షాలు బాగా కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామస్థులు ఆయురారోగ్యాలతోసుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి నైవేద్యంసమ ర్పిస్తారు. మహబూబాద్ జిల్లా మరిపెడ మున్సిపా లిటీ కేంద్రంలో ముత్యాలమ్మతల్లి బోనాల పండు గను ఘనంగా నిర్వహించుకున్నారు. డోర్నకల్ నియోజకవర్గఎమ్మెల్యే రామచంద్రు నాయక్ పాల్గొని ముత్యాలమ్మ తల్లికి మొక్కులుచెల్లించుకున్నారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఈసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి ప్రత్యేక బోనం చేసి ముత్యాలమ్మ తల్లికి మొక్కుకున్నారు. గ్రామప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని గ్రామ దేవతలకు నైవిద్యాన్ని సమర్పించి, ముత్యాలమ్మ తల్లికి పసుపు కుంకుమలతో చీరలు సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సి పాలిటీ వైస చైర్పర్సన్‌కాలం సునీత రవీందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు రాంలాల్, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ మహిళలు పెద్ద ఎత్తున ముత్యాలమ్మ తల్లికి బోనాలుసమర్పించారు.

## తీగలగుట్టపల్లి ఆర్ఓబికి ఎప్పుడు మోక్షం?

**మూడేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం. రవాణా కష్టాలు పరిష్కరించాలని కాంగ్రెస్ ధర్నా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య**



**కరీంనగర్,(సింగిడి): :** తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మూడేళ్లుగా పనులు కొనసాగుతున్నా పూర్తి కాకపోవడంతో రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు గుంతల రహదారిపై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్‌రావు సూచన మేరకు ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓబీ నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆకుల నరసయ్య మాట్లాడుతూ, ఐదు నిమిషాల్లో చేరాల్సిన దూరానికి గంట సమయం పడుతోందని, గుంతల రహదారితో వాహనదారులు, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి చేసి ఆర్ఓబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంపీ బండి సంజయ్ చొరవ తీసుకుని పనులను వేగవంతం చేయాలని కోరారు. ఆర్ఓబీ పూర్తయితే తీగలగుట్టపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు నగరంలోని పలు ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బానోతు భాస్కర్ నాయక్, సీనియర్ నాయకులు కాసెట్టి శ్రీనివాస్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కొలగాని అనిల్, మనోహర్, రాము, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ఇంటలిజెన్స్ విభాగానికి ఎన్నికైన జమ్మికుంట విద్యార్థిని


**.. దేశంలో అత్యుత్తమ ఐ బి డిపార్ట్మెంట్ లో పోస్ట్**



**జమ్మికుంట, (సింగిడి):** దేశంలో ఉన్న మారుమూల గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని అత్యుత్తమమైన కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగంలో ఉద్యోగం సాధించి పేరు ప్రతిష్టలు నిలిపింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గణేష్ నగర్ కు చెందిన వడ్లకొండ శీను వనజ దంపతుల రెండవ కుమార్తె వడ్లకొండ సింధుజ. ప్రాథమిక విద్యాభ్యాసం జమ్మికుంటలోనే కొనసాగగా ఇంటర్ విద్య హనుమకొండలో చదివింది. అనంతరం అత్యుత్తమమైన కేంద్ర సర్వీసులకు ఇష్టంతో హైదరాబాదులోని 21 సెంచరీ ఇంటిగ్రేటెడ్ డిగ్రీ తో పాటు ఐఏఎస్ కోచింగ్ తీసుకుంది. గతంలో ఐఏఎస్ కు ప్రిపేర్ అయినప్పటికీ ఫలితం రాకపోవడంతో మొక్కవోని ధైర్యంతో కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో పరీక్ష రాసి అందులో ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఇంటర్వ్యూలో విజయం సాధించింది. దేశ ప్రధానమంత్రి కి ఉండే ఐదు అంచెల భద్రతలో సెక్యూరిటీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంటెలిజెన్స్ బ్యూరో పోస్ట్ కు సింధుజ ఎంపిక కావడం పట్ల స్థానికంగా ఉన్న పలువురు విద్యావేత్తలు, మేధావులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్ననాటి నుండి చదువుపై ఆసక్తి ఉండడంతో కాకుండా కేంద్ర సర్వీసుల్లో చేయాలని సంకల్పంతో గత మూడు సంవత్సరాలుగా ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటూ ఈ పరీక్షకు అర్హత సాధించిందని అయినప్పటికీ తిరిగి మళ్లీ ఐఏఎస్ రాసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన వెల్లడించారు.

## మల్లాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

**ఆవిష్కరించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్**



**మల్లాపూర్, (సింగిడి):** మల్లాపూర్ మండల కేంద్రంలోని నంది చౌరస్తా వద్ద తెలంగాణ చరిత్రలో ధైర్యసాహసాలకు, సామాజిక సమానత్వ పోరాటానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచి సామాజిక చైతన్యానికి నాంది పలికిన మహనీయుడని కొనియాడారు. ప్రజల్లో ఆత్మగౌరవం, ధైర్యాన్ని నింపిన పాపన్న గౌడ్ చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మొగల్ పాలన కాలంలో పాపన్న గౌడ్ తనకంటూ సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని పోరాటాలు సాగించారని, ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకుని కోటలను నిర్మించి ప్రజల కోసం పరిపాలన సాగించారని పేర్కొన్నారు. ఆయన పోరాట వారసత్వం తెలంగాణ సామాజిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా నంది చౌరస్తా జనసందోహంతో సందడిగా మారింది. కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, గౌడ సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## మానేరు డ్యాం వద్ద ఘనంగా గంగమ్మ బోనాల జాతర

**ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి): :** కరీంనగర్ పట్టణ గంగపుత్ర (బెస్త) సంఘం ఆధ్వర్యంలో మానేరు డ్యాం వద్ద గంగమ్మ తల్లి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన వేడుకలకు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ప్రతినిధులు మేయర్‌ను ఘనంగా సన్మానించారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మేయర్ ఆకాంక్షించారు. బోనాల జాతరతో మానేరు డ్యాం పరిసర ప్రాంతం భక్తుల సందడితో, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, నాంపల్లి రేణుక శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యుడు బల్వీర్‌సింగ్, పట్టణ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి నాగుల రాజారాం, కోశాధికారి గడప నర్సింహస్వామి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, సంఘం ప్రతినిధులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి: కానుగుల దశరథం

**నాయి బ్రాహ్మణ సంఘాలకు నూతన సారథ్యం**



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు పట్టణ, మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘాల నూతన కార్యవర్గాలను ఆదివారం ఎన్నుకున్నారు. తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సమన్వయ కమిటీ చైర్మన్ కానుగుల దశరథం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా జంపుల పాండు, ఉపాధ్యక్షుడిగా దేవరకొండ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా జంపుల వినయ్, సహాయ కార్యదర్శిగా దేవరకొండ దుర్గాప్రసాద్, కోశాధికారిగా జంపుల సురేష్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడిగా పెరికేటి కోటయ్య, ఉపాధ్యక్షుడిగా దేవరకొండ నాగేష్, ప్రధాన కార్యదర్శిగా పగిడి పాల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా జంపుల రవి, కోశాధికారిగా గుద్దేటి బాలు బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కానుగుల దశరథం మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు నూతన కమిటీలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

## పారమిత విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

**వాకర్స్, క్రీడాకారులకు బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలు**



**కరీంనగర్, (సింగిడి):** ప్రజల్లో ఆరోగ్య అవగాహనతో పాటు విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పాఠశాల సైన్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో, నర్సింగ్ అధికారి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో స్టేడియానికి వచ్చిన వాకర్స్, క్రీడాకారులకు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, శరీర ద్రవ్యరాశి సూచిక (బీఎంఐ) తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించిన శిబిరానికి వాకర్స్, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. పాఠశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా ఆచరణలో పెట్టడం ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద్‌రావు తెలిపారు. శిబిరంలో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, సైన్స్ విభాగం ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గాయత్రీనగర్‌లో రోడ్డు పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డంకి

**స్తంభాలు తొలగించకుండానే రోడ్డు నిర్మాణం. ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి,**



**కరీంనగర్, (సింగిడి):** నగరం లోని 37డివిజన్ గాయత్రీ నగర్ లో జరుగు తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు ఇబ్బంది కరంగా మారాయని కాలనీవాసులు తెలిపారు. ముఖ్యంగా రహదారి మలుపులో రెండు స్తంభాలు ఉండటంతో ఆటోలు, కార్లు కాలనీ లోకి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత స్తంభాలను తొలగిస్తే రహదారిని తిరిగి పగులగొట్టాల్సి వస్తుందని, దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని, కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నగరపాలక సంస్థ విద్యుత్ విభాగం అధికారులను సంప్రదించాలని సూచించినట్లు తెలిపారు. దానితో స్థానిక కార్పొరేటర్‌ను సంప్రదించగా విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్‌కు ఇప్పటికే సమాచారం ఇచ్చామని, అధికారులు వచ్చి స్తంభాలను తొలగిస్తారని చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. స్తంభాలు తొలగించకుండానే రోడ్డు పనులు కొనసాగించడం వల్ల భవిష్యత్‌లో రహదారిని మళ్లీ తొలగించాల్సి వస్తుందని ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్, మేయర్ వెంటనే స్పందించి స్తంభాలను తొలగించే వరకు రోడ్డు పనులను నిలిపివేసి, అనంతరం నిర్మాణ పనులు చేపట్టాలని గాయత్రీనగర్ వాసులు కోరారు. స్థానిక కార్పొరేటర్ ప్రత్యేక చొరవ తీసుకుని కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు, ప్రభుత్వ ధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## ఎస్ఐఆర్ ఫేజ్-2పై కాంగ్రెస్ శ్రేణులకు శిక్షణ

**అర్హులైన ప్రతి ఓటు రక్షణే లక్ష్యం. భూపాలపల్లి ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ ఎస్కే సిరాజ్ హుస్సేన్**



కరీంనగర్, (సింగిడి): తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా రెండో దశ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, సమన్వయకర్తలకు హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్కే సిరాజ్ హుస్సేన్ ఇందులో పాల్గొన్నారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు నిర్వహించనున్న రెండో దశలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గుర్తించే అసాధారణ వివరాలు, సేకరించలేని వివరాలు, ఓటర్ల సమాచారంలోని తప్పులు, ఇతర లోపాలను గుర్తించి సరిదిద్దే విధానంపై శిక్షణ ఇచ్చారు. ముసాయిదా జాబితా విడుదల అనంతరం బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చేపట్టాల్సిన కార్యాచరణ, సమాచార పరిశీలన, అర్హులైన ఓటర్ల గుర్తింపు తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలు, 17 పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయ కర్తలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ శిక్షణా కమిటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐఆర్ రాష్ట్ర సమన్వయకర్త గంప వేణుగోపాల్, ఏఐసీసీ జాతీయ సమన్వయకర్తలు నిశాంత్, అనూష, రాష్ట్ర సమన్వయకర్త రఘు తదితరులు పాల్గొని రెండో దశ కార్యాచరణపై శిక్షణ, సూచనలు అందించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ రెండో దశను విజయవంతంగా పూర్తి చేస్తామని ఎస్కే సిరాజ్ హుస్సేన్ తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

**230 గ్రాముల గంజాయి స్వాధీనం**



**జమ్మికుంట, (సింగిడి): :** జమ్మి కుంటలో అక్రమంగా గంజాయి విక్రయించేం దుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను జమ్మికుంట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 11,400 విలువైన 230 గ్రాముల గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన నాగిరెడ్డి హరిప్రసాద్, దుర్గం కార్తిక్ అనే ఇద్దరు యువకులు గంజాయి అలవాటుకు బానిసల య్యారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ నెల 15న మహారాష్ట్రలోని నాగపూర్ వెళ్లి ఒక వ్యక్తి వద్ద 230 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి, రైలులో మందమర్రికి తెచ్చి ఆదివారం ఆ గంజాయిని విక్రయించేందుకు జమ్మికుంటలోని ఎఫ్‌సీఐ గోడౌన్ పరిసర ప్రాంతానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా, నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి, ఫోన్లు లభ్యమయ్యాయి. పట్టణంలో గాని పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయం కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణ గౌడ్ హెచ్చరిం చారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల్లో ప్రధాని మోదీ ఫొటో ముద్రించాలి

**కేంద్ర పథకం ద్వారా తెలంగాణలో 2 కోట్ల మందికి ఉచిత బియ్యం అందుతోంది: డిప్యూటీ మేయర్, యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, (సింగిడి):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' కింద తెలంగాణలో సుమారు 2 కోట్ల మంది ప్రజలకు ప్రతి నెలా ఉచితంగా 5 కిలోల బియ్యం అందిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. ఆదివారం రోజున ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 21 కోట్ల రేషన్ కార్డుదారులకు చెందిన సుమారు 90 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ కొనసాగుతోందని, ఈ పథకాన్ని 2031 వరకు పొడిగించినట్లు తెలిపారు. పేదలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేస్తున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించి, కేంద్ర పథకం ద్వారా ఉచిత బియ్యం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ముద్రించకపోవడం విచారకరమన్నారు. కేంద్ర నిధులతో అమలయ్యే పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వాలను గౌరవించే విధంగా కేంద్రం వ్యవహరిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ప్రొటోకాల్‌ను పాటించడం లేదని విమర్శించారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను కూడా ముద్రించి, కేంద్ర ప్రభుత్వ పాత్రను ప్రజలకు తెలియజేయాలని సునీల్‌రావు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి సరిదిద్దుకోవాలని కోరారు.

## ప్రాథమిక పాఠశాలకు ప్రొజెక్టర్ బహుకరించిన సర్పంచ్

**– అప్పాజీపల్లి సర్పంచ్ వెంకట్ గౌడ్ (గజిని)**



**కొల్చారం (సింగిడి):** విద్యార్థులు ప్రస్తుత విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన బోధనోపకరణలు ఉండడం వలన, వాళ్లకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయడానికి సాంకేతికత తోడ్పాటు అందించడంలో, ఉపాధ్యాయులు సరళమైన పద్ధతిలో విద్యార్థుల అర్థమయ్యే విధంగా, ప్రస్తుత సాంకేతిక వ్యవస్థను విద్యావ్యవస్థను అనుసంధానం చేసినట్లయితే విద్యార్థులలో మంచి ఫలితాలు రాబట్ట వచ్చని ఆయన తెలియజేశారు. అనంతరం పాఠశాలకు తన వంతు సహాయంగా 25వేల రూపాయల విలువగల ప్రొజెక్టర్ మరియు స్క్రీన్ ను సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ మెంబర్లు ఉపాధ్యాయులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బోయవాడలో గంగమ్మ తల్లి బోనాలు

**బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్న, మాజీ మంత్రి గంగుల కమలాకర్**



**కరీంనగర్, (సింగిడి):** జిల్లా కేంద్రంలోని బోయవాడలో గంగమ్మ తల్లి బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బోనాల వేడుకలతో బోయవాడలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్ తాటి ప్రభావతి, మాజీ కార్పొరేటర్ సోహన్‌సింగ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గడప మల్లేశం, స్థానిక నాయకులు కర్ర సూర్యశేఖర్, కన్న కృష్ణ, నేతి రవివర్మ, గంగాధర చందు, స్వామి, నవీన్, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

### గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



**జమ్మికుంట, (సింగిడి):** యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని జమ్మికుంట మండలం అంకుశ పూర్ గ్రామ సర్పంచ్ కవిడె కుమారస్వామి 16వ వార్డు కౌన్సిలర్ కుతాటి తిరుపతి పిలుపునిచ్చారు .జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో వాలీబాల్ టోర్నమెంట్ను శనివారం నిర్వహించారు. టోర్నమెంట్ లో భాగంగా 12 టీములు పాల్గొనగా మొదటి విజేతగా వీణవంక మండలం మండలం మల్లారెడ్డి పల్లె వాలీబాల్ టీం గెలుచుకోగా ద్వితీయ విజేతగా ఇల్లంతకుంట మండలం సిరిసేడు టీం గెలుచుకుంది ఈ సందర్భంగా నగదు బహుమతిని 16వ వార్డు కౌన్సిలర్ కుతాటి తిరుపతి 8000 వేల రూపాయలను నగదును టోపీలను జమ్మికుంట మండలం అంకుశ పూర్ గ్రామ సర్పంచ్ కవిడె కుమారస్వామి గెలుపొందిన టీములకు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆవుల తిరుపతి పోట్టాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోరపల్లిలో ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



జమ్మికుంట, **(సింగిడి):** జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని అంబేద్కర్ కూడలి వద్ద బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ ముందస్తు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గండి రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గండి రంజిత్ కుమార్ మాట్లాడుతూ... నిరంకుశ పాలకులపై పోరాడి బహుజనులకు రాజ్యాధికారాన్ని అందించిన పోరాట యోధుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు ఐదేళ్లుగా నిలిచిపోయిన ?5 లక్షల ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.4.10 లక్షల భరోసా

**తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం**



**కరీంనగర్, (సింగిడి):** అనారోగ్యంతో మృతి చెందిన కరీంనగర్ జిల్లాకు చెందిన ఫోటోగ్రాఫర్ మహిమల సంధ్య కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 4.10 లక్షల కుటుంబ భరోసా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవి, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి భూపతి సూరిబాబు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, సభ్యుల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుడు కొప్పుల కనకారావు, నైస్ రఫీ, నాగిశెట్టి రమేష్, దక్షిణ భారత అసోసియేషన్ ప్రతినిధి రాజేశ్వర్‌రెడ్డి, బొంగోని మధు, మియాపురం రాజు, లక్ష్మణ్ శంకరాచారి, మాటూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi మంగళవారం 18-8-2026

# ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించాలి..

**ప్రజావాణికి 41 ఫిర్యాదులు... కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



**గద్వాల బ్యూరో (సింగిడి):** ప్రజావాణి ఆర్జీలను పెండింగ్ లో ఉంచ కుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టరు మధుమోహన్ తో కలిసి ప్రజల నుంచి కలెక్టర్ ఆర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి మొత్తం 41 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వివిధ శాఖలకు సంబంధించి సీఎం ప్రజా వాణికి మొత్తం ఇప్పటి వరకు జిల్లా నుంచి 244 దరఖాస్తులను ఇవ్వగా ఇంకా 57 ఆర్జీలను పరిష్కరించాల్సి ఉందన్నారు. మం డల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమంను నిర్వహిస్తున్నందున సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులందరూ తప్ప కుండా హాజరై తమ శాఖల పరిధిలో వచ్చిన ఆర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో జరుకావాలని, అలసత్వం చూపే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు..

# వేగంగా పరిష్కరించాలి

**అధికారులకు ఎమ్మెల్యే సాంబశివరావు ఆదేశం**

**చుంచుపల్లి ప్రజావాణిలో 22 ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే**





**చుంచుపల్లి, (సింగిడి):** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోనవేని సాంబశివరావు అధికారు లను ఆదేశించారు. సోమవారం చుంచు పల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో సుభాషిణితో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అధికారులు వారధిగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై, ప్రజలు అందజేసే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అన్నారు. వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో గృహజ్యోతి, ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళల పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, డ్రైనేజీ కాలువలు తదితర సమస్యలపై మొత్తం 22 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో సుభాషిణి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

# పథకాలను వెంటనే పునరుద్ధరించాలి

**ధర్నా చౌక్ లో బీఆర్ఎస్ నిరసన**



**నిజామాబాద్ ప్రతినిధి (సింగిడి):** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు ఆధ్వర్యంలో నిజామాబాద్ ధర్నా చౌక్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వా నికి వ్యతిరేకంగా సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు సిర్ప రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందనిలి ఆరోపించారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను రద్దు చేసే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం ఎంతటి ఆర్థిక భారంగా మారుతుందో గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 అక్టోబర్ 2న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రారంభంలో రూ. 51 వేలుగా ఉన్న ఆర్థిక సహాయాన్ని దశలవారీగా రూ. 75,116కు, అనంతరం రూ. 1,00,116కు పెంచి పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ. 13 వేల కోట్ల మేర ఆర్థిక సహాయంలి అందించారని, కరోనా వంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయం లో కూడా కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగిస్తూ పేద కుటుంబాలకు భరోసా కల్పించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ కక్ష సాధింపులను పక్కన పెట్టి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిస్థాయిలో కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్,మాజీ నూడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్,నవీద్ ఇక్బాల్,అబ్దుల్ మతీన్, జగత్ రెడ్డి , బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వ్యర్థాల ఏర్పాటు వెంటనే రద్దు చేయాలి

**ఎంపీడీఓ తహసీల్దార్ కి వినతి పత్రం అందజేసిన సర్పంచ్**



**కల్వకుర్తి ఆగస్టు 17 (నినాదం)** మార్చాల గ్రామ శివారులోని సర్వే నంబర్ 316, పలగుట్ట ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయడాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గ్రామ ప్రజలు, రైతులు, యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామపంచాయతీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ నిజాముద్దీన్, రైతులు మరియు గ్రామస్తులు కలిసి ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశారు. మార్చాల గ్రామ శివారులో రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో గ్రామ ప్రజలకు, రైతులకు, పర్యావరణానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన యూనిట్ ఏర్పాటు విషయంలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలన జరిపిన అనంతరం మాత్రమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. పల్లగుట్ట ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, అక్కడి భూములు మరియు పరిసర ప్రాంతాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామ ప్రజలు తెలిపారు. గ్రామ ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా యూనిట్ ఏర్పాటు చేయవద్దని, ప్రజల అభిప్రాయాలను గౌరవించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏ పరిశ్రమ లేదా యూనిట్ ఏర్పాటు చేసినా ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటుపై గ్రామ ప్రజల్లో ఉన్న అభ్యంతరాలను అధికారులు సానుకూలంగా పరిశీలించి, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, ఉప సర్పంచ్ నిజాముద్దీన్, వార్డు సభ్యులు వట్టేపు కిషోర్, మాయని సుమంత రాజశేఖర్, రజిత మల్లేష్, పర్వత్ రెడ్డి, సికిందర్, అక్షయ విశ్వేశ్వర్, యాదిరాల యాదయ్య, బిజినపల్లి స్వాతి బాలరాజు, పల్స అనురాధ జంగయ్య, కంకల అలివేల జంగమయ్య, గ్రామ మాజీ ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్, యువ నాయకులు వట్టేపు గణేష్ తదితరులు ప్రజల తరఫున తమ అభ్యంతరాలను అధికారులకు వివరించారు.

# ఎస్ఐఆర్‌లో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల

**సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలి**

**అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల**

**అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చర్యలు**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్**



**నాగర్‌కర్నూల్, (సింగిడి):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సోమవారం విడుదల చేశారు. 910 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్‌లో ప్రకటించారు.
ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఉండేలా చూడటంతో పాటు, అనర్హమైన లేదా నిబంధనలకు విరుద్ధంగా నమోదైన వివరాలను గుర్తించి సరిచేయడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించారని, ఎన్యూమరేషన్ ఫారాలను నమోదు చేసి సంబంధిత రికార్డులతో సరిపోల్చిన అనంతరం డ్రాఫ్ట్ జాబితా రూపొందించామని చెప్పారు. ప్రస్తుత ఓటర్ల వివరాలను 2002 నాటి జాబితాతో మ్యాపింగ్ చేసి కుటుంబ సంబంధాలు, చిరునామాలు తదితర వివరాలను కూడా పరిశీలించినట్లు తెలిపారు. జూన్ 10 నాటికి 880 పోలింగ్ కేంద్రాల్లో 7,31,632 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ అనంతరం వాటి సంఖ్య 910కి పెరిగింది. ఆగస్టు 17న విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితా ప్రకారం మొత్తం 6,18,592 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,11,395 మంది పురుషులు, 3,07,182 మంది మహిళలు, 15 మంది ఇతరులు, 579 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. ఎస్ఐఆర్ పరిశీలనలో 22,669 మంది మరణించిన ఓటర్లు, 18,260 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని వారు, 20,396 మంది ఇతర జిల్లాలు లేదా నియోజకవర్గాలకు ఓటు మార్చుకున్న వారు ఉన్నట్లు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు.
డ్రాఫ్ట్ జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని, వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరూ డ్రాఫ్ట్ జాబితాలో తమ పేరు, తండ్రి/భర్త పేరు, వయస్సు, లింగం, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హత ఉన్నప్పటికీ పేరు లేకపోతే గడువులోగా క్లెయిమ్ దాఖలు చేయాలని, వివరాల్లో తప్పులు ఉంటే సవరణకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.
చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తులు సమర్పించాలని సూచిం చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శ కంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా చర్యలు తీసుకుం టామని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం కీలకమని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పనతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి విధానాలతో మేలు

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల బ్యూరో (సింగిడి):** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని, ముఖ్యంగా పంట మార్పిడి విధానాలతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమ వారం ఐడిఓసి సమావేశపు మందిరంలో కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా భిన్నమైన పంటలను సాగు చేయడం వలన నేల సారవంతం అవుతుందన్నారు. సెప్టెంబర్, అక్టోబర్‌లోను వర్షాలు పెద్దగా కురిసే అవకాశం లేదన్న వాతావరణ శాఖ సూచనల మేరకు అన్నదా తలు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు లో నిలువ ఉన్న నీటిని తాగునీటి అవసరాలకి మాత్రమే వినియోగించడం జరుగుతుందన్నారు. జనాభా గణనలో భాగంగా జిల్లా స్థాయి సెన్సెస్ హ్యాండ్ బుక్ తయారీకి అవసరమైన సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నందున నిర్దేశిత గడువులోగా ఓటర్ల అభ్యంతరాలను స్వీక రించి తప్పులు లేని, సమగ్ర, పారదర్శకమైన తుది ఓటరు జాబితా ప్రకటించేందుకు ఎస్ఐఆర్ ను ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. చికెన్ గునియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పి హెచ్ సి లతోపాటు ఇతర ఆసుపత్రులను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు తరచూ సందర్శిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, రెసిడెన్షి యల్ పాఠశాలలను సంబంధిత అధికారులు తరచు సందర్శిం చాలని, అక్కడి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిం దిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశిం చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సూచన మేరకే వినియోగించాలి

**జిల్లా వైద్య అధికారి డాక్టర్ రామారావు**




**ఖమ్మం, (సింగిడి):** యాంటీబయా టిక్స్‌ను అవసరం ఉన్నప్పుడు మాత్రమే, వైద్యుల సూచన మేరకు సరైన మోతాదులో మరియు నిర్ణయించిన కాలవ్య వధి వరకు వినియోగించాలని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి ప్రజలకు సూచించారు. సాధారణ జలుబు, ఫ్లూ వంటి వైరస్‌ల వల్ల కలిగే అనేక ఇన్ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయవని తెలిపారు. వైరల్ ఇన్ఫెక్షన్లకు స్వయంగా యాంటీబ యాటిక్స్ తీసుకోవడం వల్ల ప్రయోజనం లేకపోవడంతో పాటు, యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ పెరిగే ప్రమా దం ఉందని పేర్కొన్నారు. యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ పెరిగినప్పుడు సాధారణంగా చికిత్సతో నయం అయ్యే బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లు కూడా చికిత్సకు స్పందించకపోవచ్చని తెలిపారు. దీనివల్ల వ్యాధి ఎక్కువకాలం కొనసాగడం, ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితులు చికిత్స ఖర్చులు పెరగడం వంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

**ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు..**
వైద్యుల సలహా లేకుండా యాంటీ బయా టిక్స్‌ను కొనుగోలు చేసి వాడకూడదు, ఇతరులకు సూచించిన యాంటీబయాటిక్స్‌ను తాము ఉపయోగించకూడదు అని– వైద్యుడు సూచించిన మోతాదు ,సమయపట్టికను కచ్చితంగా పాటించాలి అని,వైద్యుడు సూచించిన కోర్సును మధ్యలోస్వయంగా నిలిపివేయకూడదు. గిలిపోయిన యాంటీ బయాటిక్స్‌ను భవిష్యత్తులో స్వయంగా ఉపయోగించకూడదు అని, జలుబు, దగ్గు, గొంతునొప్పి వంటి ప్రతి అనారోగ్యానికి యాంటీబయాటిక్స్ అవసరం ఉండదని గుర్తించాలి అని,యాంటీబయాటిక్స్ వినియోగంపై సందేహాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి అని,వైద్యులు కూడా సరైన నిర్ధారణ ఆధారంగా అవసరమైన సందర్భాల్లో మాత్రమే యాంటీబయాటిక్స్‌ను సూచించాలని, ప్రజలకు వాటి బాధ్యతాయుత వినియోగంపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి సూచించారు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికడదాం, యాంటీబయాటిక్ రెసిస్టెన్స్‌ను తగ్గిద్దాం – భవిష్యత్ తరాలకు సమర్థవం తమైన చికిత్సను కాపాడుదాం" అని ఆయన పేర్కొన్నారు.


## అక్రమ వేటగాళ్లను కఠినంగా శిక్షించాలి

**నవీన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు**



**ఖమ్మం, (సింగిడి):**. జంతువులను వేటాడటానికి అక్రమంగా వేటగాళ్లు విద్యుత్తు ఉచ్చులకు జంతువులతో పాటు సాధారణ మనుషులు ఫారెస్ట్ అధికా రులు బలి అవుతున్నారు. వారి ఆగడాలకు అంతులేకుండా పోయింది. దీనిలో భాగంగా ఇటీవల కారేపల్లి మండలం గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బానోతు దేవ్లా నాయక్ కుమారుడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ నాయక్ కర్తవ్య నిర్వహణలో భాగంగా ఫారెస్ట్ లో అక్రమంగా వేసిన విద్యుత్ తీగల కు తగి లి దుర్మరణం చెందారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, పిఏసిఎస్ అధ్యక్షులు, పుచ్చకాయల వీరభద్రం ధనియాకుల హనుమంతరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్ తదితరులు వారి కుటుంబాన్ని పరామర్శించి నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి అక్రమ వేటగాళ్లను, ఎంతటి వారైనా ఉపేక్షించకుండా భవిష్యత్తులో ఇలాంటి అధికారులను పోగొట్టుకోకుండా ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబానికి మేము వెన్నుదన్నుగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అడ్డగోడ ఐలయ్య, ముత్యాల సత్యనారాయణ ఉన్నం వీరేందర్ రావూరి శ్రీనివాస్, ఏపూరి మల్లికార్జున్ దేగల ఉపేందర్ లక్ష్మణ్, మరియు గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీ లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఐజలో వీధిలైట్లు, ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలి



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో వీధిలైట్లు, ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయ కులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐజ ఎంపీ డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికా రు లకు వినతిపత్రం అందజేశారు. పట్టణం అభివృద్ధి చెందు తున్న నేపథ్యంలో ప్రధాన రహదా రులు, కాలనీల్లో విద్యుత్ వెలుగులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐజ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రత్యేకంగా ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కట్టకింద స్వామి దేవాలయం, సంకాపురం, బొక్కమ్మ భాయి, ఉప్పల రోడ్డు మార్గాల్లో లైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేజీబీవీ పాఠశాల, పోలోనువాగు, బీసీ కాలనీ మార్గాల్లోనూ వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణ సుంద రీకరణతో పాటు రాత్రివేళ ప్రజల భద్రతకు లైట్ల ఏర్పాటు ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు. వినతిపై అధికా రులు స్పందించి త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కొట్టే మాదిగలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలి



ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు టీఎంఆర్పీఎస్ వినతి

**కొత్తగూడెం (సింగిడి):** డప్పు కొడుతూ సంప్రదాయ కళను కొనసాగిస్తున్న మాదిగలకు నెలకు రూ. 5 వేల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎంఆర్పీఎస్) ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావుకు వినతిపత్రం అందజేశారు. టీఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ నాయకులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి పలు డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డప్పు కొట్టే మాదిగ కళాకారులకు నెలకు రూ. 5 వేల పెన్షన్ అందించాలని, మాదిగ దండోరా ఉద్యమకారులకు 200 గజాల చొప్పున స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే అర్హులైన దళితులకు 'అంబేద్కర్ అభయహస్తం' పథకం కింద రూ. 12 లక్షల ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవా లని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సానుకూలంగా స్పందిస్తూ, మాదిగల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు జీడి శ్రీనివాస మాదిగ (జె. శ్రీను), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మచ్చ పృథ్వీరాజ్ మాదిగ, టిఎంవైఎన్ జిల్లా అధ్యక్షులు బొమ్మెర అశోక్ మాదిగతో పాటు నాయకులు పాల్గొన్నారు.




## పేదలకు అండగా ప్రజాపాలన

**సర్పంచ్ డా. రామావత్ లాల్ సింగ్**

**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** ప్రజాపాలనలో భాగంగా పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా చేయూత పింఛన్ కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కారేగాం తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ డా. రామావత్ లాల్ సింగ్, గ్రామ కార్యదర్శి

# ఘనంగా బంగారు మైసమ్మ అమ్మవారి బోనాలు

**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామ సమీపంలో ఉన్న కాటన్ మిల్ బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పిసిసి అధికార ప్రతినిధి బాలాజీ సింగ్ స్థానిక సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి,ఆలయ కమిటీ సభ్యుల తో కలిసి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ,బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి అని మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను నెత్తిన పెట్టుకుని అమ్మవారికి సమర్పించేందుకు తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే ఆల యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారికి అలంకరణ కార్యక్ర మాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపు సందర్భంగా మహిళలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తితో బోనాలు సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొనాలని భక్తులు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. బోనాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో అందంగా అలంకరించడంతో ఆలయ పరిసరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తుల రాకతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. మహిళలు భక్తి పాటలు, బోనాల నృత్యాలతో ఉత్సవానికి మరింత శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను ప్రతి సంవత్సరం సంప్రదా యబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన గ్రామ ప్రజలకు, భక్తులకు, యువతకు కార్యక్రమ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల జయజయధ్వానాలతో బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన బోనాల ఉత్సవాలు గ్రామ ప్రజలకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్ కుమార్, మండల అధ్యక్షుడు బల్ రెడ్డి,అర్చకులు దత్తశర్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పుల్ల రెడ్డి,సభ్యులు మధన్ మోహన్ రావు,బాలయ్య,వార్డు సభ్యులు,మాజీ ప్రజా ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు,యువజన సంఘం సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



## అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు చట్టబద్ధత కల్పించాలి

**తులం బంగారం హామీ అమలు చేయలేకే కుట్రలు: మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్‌రావు**

**కరీంనగర్, (సింగిడి):** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ హామీని అమలు చేయలేక పథకాలపై న్యాయ పరమైన సమస్యలు సృష్టిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పిలుపు మేరకు, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదేశాలతో నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ చౌక్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరదాసు లక్ష్మణ్‌రావు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నరదాసు లక్ష్మణ్‌రావు మాట్లా డుతూ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు చట్టబద్ధత లేదంటూ హైకోర్టులో కేసు వేయడం, అనంతరం ప్రభుత్వం సకాలంలో స్పందించక పోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కోర్టు ఇచ్చిన గడువులో ప్రభుత్వం సమర్థవం తంగా స్పందించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీము బారక్ పథకాలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే న్యాయ నిపుణులతో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రానున్న శాసన సభ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి పథకాలకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యా ప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షు డు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, కార్పొరేటర్లు నలువాల రవీందర్, యూసుఫ్, మాజీ కార్పొ రేటర్లు ఎడ్ల సరిత, అశోక్, గందె మాధవి, మహేష్, మైఖేల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొ న్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా శ్రేణులు హాజరయ్యారు.

# 30 రోజులు దాటిన అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు

## కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, (సింగిడి):** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, వివిధ శాఖల అధికారు లతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాల యం నిరంతరం పర్యవేక్షిస్తున్నందున 30 రోజులు దాటిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పింఛన్ల దరఖాస్తుల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారు ఎవరూ అవకా శాన్ని కోల్పోకుండా చూడాలని తెలిపారు. పాఠశాల విద్యార్థుల ఏకరీతి దుస్తుల పంపిణీలోనూ ఇబ్బం



దులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

**పింఛన్ల దరఖాస్తులకు ఆహార భద్రత కార్డు ప్రామాణికం...**

చేయూత పింఛన్లకు సంబంధించి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గీత, మెప్మా ప్రాజెక్టు అధికారి స్వరూప రాణి మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్ మినహా ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు తదితర పింఛన్లకు ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలకు గ్రామీణ ప్రాంతాల్లో 35 ఏళ్లు, పట్టణ ప్రాంతాల్లో 40 ఏళ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. కొత్త పింఛన్ల దరఖాస్తులకు ఆహార భద్రత కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నామని, గత నిబంధనలే కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రతి గ్రామపంచాయతీ, మండల కేంద్రం, మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలో పింఛన్లకు సంబంధించిన సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో గ్రామసభలు, వార్డు సభలు, ప్రజాపాలన వారోత్సవాల్లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గతంలో పత్రాలు సమర్పిం చని వారు, దరఖాస్తు చేయని అర్హులు మాత్రం అవసర మైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తిస్తారని తెలిపారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలి

**తులం బంగారం హామీ అమలు చేయలేకే పథకాలపై కుట్రలు, ఎన్నికల 420 హామీలు ఆరుగ్యారంటీలు అమలు చేయాలి**

**మాజీ ఏంఎల్ఏ రసమయి బాలకిషన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జివిరామకృష్ణ రావు**



**కరీంనగర్, (సింగిడి):** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిలిపివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభు త్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షుడు జి.వి.రామకృష్ణరావు ఆదేశాలతో మానకొండూర్ మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రసమయి బాలకిషన్ రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినా దాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణరావు, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ తూల ఉమా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయలేక పథకాల పై న్యాయపరమైన సమస్యలు సృష్టిస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జివి. రామకృష్ణ రావు మాట్లాడుతూ, కల్యాణలక్ష్మి, షాదీము బారక్ పథకాలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి పథకాలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సామాజిక మాధ్యమాల కన్వీనర్ పావని గౌడ్, అధికార ప్రతినిధి శతరాజ్ యాదగిరి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఉద్యోగులకు సన్మానం

**రాజిరెడ్డి భాస్కర్ లను సన్మానించిన మున్సిపల్ చైర్మన్**

**జమ్మికుంట, (సింగిడి):** విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ కనబరిచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న జమ్మికుంట మున్సిపాలిటీ లో మేనేజర్ గా పని చేస్తున్న గుర్రాల రాజిరెడ్డి రెవెన్యూ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న భాస్కర్ ను మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ సోమవారం తమ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడిన ఉత్తమ సేవా పురస్కారాల అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. వారు నిస్వార్థంగా



నిష్పక్షపాతంగా సేవలు అందించడం అభినందనీయమని భవిష్యత్తులో ఇదే విధంగా పనిచేస్తూ మున్సిపల్ పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జావేద్ కౌన్సిలర్లు చందా రాజు దిడ్డి రాము వేణుగోపాలరావు అజయ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులపై మేయర్ ఆకస్మిక తనిఖీ

**నాణ్యతలో ఎలాంటి రాజీ వద్దు: మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి):** నగరంలోని 60వ డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ కొలగాని శ్రీనివాస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పనుల ప్రదేశానికి చేరుకున్న ఆయన రోడ్డు నిర్మాణ పురోగతితో పాటు పనుల నాణ్యతను పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్న నిర్మాణ సామగ్రి నాణ్యత, కాంక్రీట్ మిశ్రమం, రోడ్డు మందం, నిర్మాణ పద్ధతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా పనులను పూర్తి చేయాలని మేయర్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# పీయంజే. జ్యువెలర్స్ దోపిడీ ముఠాపై పీడీ యాక్ట్

**ఐదుగురు ప్రధాన నిందితులపై నిర్బంధ ఉత్తర్వులు జారీ**

**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ పట్టణంలోని పీ.యం.జే. జ్యువెలర్స్‌లో జరిగిన బందిపోటు దోపిడీ కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురు ముఠా సభ్యులపై కరీంనగర్ పోలీసులు పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 మే 3న జ్యువెలర్స్‌లోకి చొరబడిన దుండగులు సిబ్బం దిపై



తుపాకులతో కాల్పులు జరిపి, సుమారు రూ. 82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేయగా, ప్రధాన నిందితులైన రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జాగీరా సింగ్, రావిష్ కుమార్ అలియాస్ ప్రద్యుమాన్, సూర్యమణి కుమార్ అలియాస్ సనోజ్, యాదవ్ అలియాస్ జైనుల్ అబ్దిన్, మొహ మ్మద్ ఆదిల్ ఖాన్‌లపై ఆగస్టు 17న పీడీ యాక్ట్ అమలు చేశారు. నేర కార్యకలాపాలను అరికట్టడం, ప్రజల భద్రతకు భరోసా కల్పించడం, భవిష్యత్తులో ఇలాంటి నేరాలకు పాల్పడకుండా నిరోధించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఆయన జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా జైలులో నిందితులకు అందజేసి, అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. పీడీ యాక్ట్ అమలులో కీలకంగా వ్యవహరించిన కరీంనగర్ పట్టణ ఏసీపీ ఎన్. వెంకటస్వామి, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె. సృజన్ రెడ్డిని కమిషనర్ అభినందిం చారు. నేరస్థులపై కరీంనగర్ పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తారని గౌష్ ఆలం స్పష్టం చేశారు.

# రైతులకు సొసైటీ అందిస్తున్న పథకాలపై విద్యార్థుల క్షేత్ర పరిశీలన

**సహకార సొసైటీని సందర్శించిన అగ్రికల్చర్ విద్యార్థులు .. రైతులకు అందిస్తున్న సేవలను వివరించిన పిఏసిఎస్ చైర్మన్**

**జమ్మికుంట, (సింగిడి):** చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ హైదరాబాద్ అగ్రిక ల్చర్ విద్యార్థులు సురేష్ జ్ఞాన విహార్ యూనివ ర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు సోమ వారం జమ్మికుంట పట్టణంలోని రైతు సహకార సంఘాన్ని సందర్శించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాజెక్టు వర్క్ నిర్వహిస్తున్న ఈ యూనివర్సిటీల అగ్రికల్చరల్ విద్యార్థులు రైతులకు సహకార సంఘం అందిస్తున్న సేవ లపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సంద ర్భంగా యూనివర్సిటీ విద్యార్థులకు పిఏసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి విద్యార్థులకు సొసైటీ అందిస్తున్న సేవల గురించి పూర్తిగా వివరించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు రైతులకు సొసైటీ ద్వారా ఏ రకమైన సంక్షేమ పథకాలు అందిస్తారని వారికి సహకార సంఘం ద్వారా రుణాలు ఎలా ఇస్తా రని పలు ప్రశ్నలు అడిగారు. దానికి స్పందిం చిన సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ, సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతుకు ఒక ఎకరానికి 40 వేల రూపాయలను అప్పుగా ఇస్తామని అది






కూడా 3లక్షల వరకు మాత్రమే ఇస్తామని తెలిపారు. ఇచ్చిన అప్పు 6 నెలలకు చెల్లించాలని దానికి తక్కువ వడ్డీ ఉంటుందని ఒకవేళ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రుణం మాఫీ అవుతుందని లేకపోతే తిరిగి చెల్లించాల్సి ఉంటుందని విద్యార్థులకు తెలిపారు. అంతేకాకుండా బంగారం తాకట్టు పెట్టుకొని కూడా రైతులకు అతీతక్కువవడ్డీకి రుణాలు అందిస్తామని ఇది కేవలం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘం అని తెలిపారు. ఇవే కాకుండా రైతులకు సబ్సిడీ రేట్లపై ఎరువులు అందిస్తామని వాటితోపాటు ఐకెపి కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సొసైటీ ఉంటుందని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపి ఇలాంటి సహకార సంఘాల సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం వల్ల మాకు కొన్ని విషయాలు సులభంగా తెలుసుకోవడం జరుగుతుందని సొసైటీ చైర్మన్ పొన్నగంటి సంపత్ అందించిన సహకారం మరువలేనిది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు డి నవ్య వి జోష్నా ఎన్ మమత రెడ్డి మనిషా హాజీరా మనిషి గంగా రేణుక ప్రవళిక సంధ్యారెడ్డి తోపాటు సురేష్ విజ్ఞాన విహార్ యూనివర్సిటీ విద్యార్థులు కే స్నిగ్ధ కే మోహన ప్రియదర్శిని డి యేసు రాజ్యం బి లహరి ఎస్ లిఖిత ఎం నాగ పూజిత కల్పన పి నవ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు**

**కోరుట్ల, (సింగిడి):**:గూడు లేని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో ఏ ఒక్క కుటుంబం ఇల్లు లేకుండా ఉండకూడదని సొంత ఇల్లు లేని అర్హులైన వారందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల పట్టణంలోఎంబేరి మమత రవికుమార్ దంపతులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించుకొని సోమవారం గృహప్రవేశం చేసిన కుటుంబాన్ని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి తిరుమల వసంత గంగాధర్ లతో కలిసి



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అభినందించి వారికి నూతన వస్త్రాలను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ నియోజక వర్గంలో ఏ ఒక్క కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదని అర్హులకు తప్పకుండా ఇల్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్



కౌన్సిలర్ వైస్ చైర్మన్ షాహిద్ కోరుట్ల వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్తల మండల అధ్యక్షుడు ఎత్తిరాజం నరసయ్య, కోరుట్ల నియోజక వర్గం యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎల్లేటి మహిపాల్ రెడ్డి, ఎంబేరి సత్యనారాయణ, మార్గం ప్రతాప్, ఆకాష్, మామిడాల మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రసంగికి అవార్డుల వర్షం

**రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో.. డాన్స్ స్టూడియో విద్యార్థుల విజయకేతనం**

**జమ్మికుంట, (సింగిడి):** కరీంనగర్‌లోని కళాభారతి కరీంన గర్ బస్‌స్టాండ్ ఎదురుగా స్టార్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్టు 16, 2026న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ చేపట్టారు ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ప్రసంగి డాన్స్ స్టూడియో ఓ ఫిట్‌నెస్ సెంటర్, జమ్మికుంట విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నృత్య కళాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్, ఆల్ స్టైల్స్ తదితర విభాగాల్లో సోలో, డ్యూయెట్, గ్రూప్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ వెస్ట్రన్ సోలో విభాగంలో అడ్ల అశ్విత ప్రథమ బహుమతి సాధించగా, సీనియర్ ఫోక్ సోలో విభాగంలో వి. భావన ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. అలాగే జూనియర్ వెస్ట్రన్ సోలో విభాగంలో పి. ప్రకృతి ద్వితీయ బహుమతి, జూనియర్ ఫోక్ సోలో విభాగంలో కె. రసజ్ఞ ద్వితీయ బహుమతి సాధించారు. జూనియర్ ఫోక్ డ్యూయెట్ విభాగంలో కె. రసజ్ఞ, పి. ప్రకృతి జంట ద్వితీయ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా ప్రసంగి డాన్స్ స్టూడియో డైరెక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. "ఇప్పటివరకు మా ప్రసంగి డాన్స్ స్టూడియో విద్యార్థులు 15 రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో, అలాగే 2 జాతీయ స్థాయి నృత్య పోటీల్లో విజయాలను సొంతం చేసుకోవడం మాకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. విద్యార్థులు ప్రతి పోటీలో తమ ప్రతిభను నిరూపించుకుంటూ వరుస విజయాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది" అని అన్నారు. "ఈ




విజయాల వెనుక విద్యార్థులకు నిరంతరం శిక్షణ అందిస్తూ కృషి చేస్తున్న ప్రసంగి డాన్స్ మాస్టర్స్, ప్రసంగి, కె. రాజేష్‌లకి ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమ పిల్లలను నిరంతరం ప్రోత్సహిస్తూ, పోటీలకు పంపిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రసంగి డాన్స్ స్టూడియోతో పాటు జమ్మికుంటకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల పట్ల స్టూడియో మాస్టర్లు, తల్లిదండ్రులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు అభినందనలు తెలిపారు.

## మాజీ విద్యాధికారి భావన ఋషి గుండెపోటుతో మృతి

**జమ్మికుంట, (నినాదం):** జమ్మికుంట పట్టణంలోని కృష్ణ కాలనీకి చెందిన మాజీ విద్యాధికారి భావన ఋషి సోమవారం గుండెపోటుతో మృతి చెం దారు. మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిం చారు. అనంతరం ఇన్చార్జి విద్యా ధికారిగా తన సేవలను అందించారు. సోమవారం ఉదయం తన పనులు తాను చేసుకుంటూ అటు ఇటు తిరిగిన భావన ఋషి ఒకసారిగా కుప్ప కూలి పడిపోయారు దీనితో కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణం లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారని కుటుంబ సభ్యులు




పేర్కొన్నారు. భావన రుషి మృతి పట్ల పలువురు పూర్వ విద్యార్థులు సహచార సిబ్బంది కాలనీవాసులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూ తిని తెలిపారు. భావన ఋషి విద్యారంగంలో అందించిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆకస్మిక మృతి బాధాకరమని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు శ్రీనివాస్ పేరు కొన్నారు. సాయంత్రం జమ్మికుంటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రభుత్వంపై భగ్గుమన్న బిఆర్ఎస్ నాయకులు

**జమ్మికుంట, (సింగిడి)::** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అలాంటి ప్రయత్నాలు ఉపసంహరించు కొని పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం మండిపడుతూ జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి ఎమ్మార్వో కు వినతిపత్రం అందించిన బీఆర్ఎస్ శ్రేణులు. సోమవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏ డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది టిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలు చేస్తూ సంక్షేమ పథకాల అమలు చేయాలని నిరసిస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ పిఎసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్ లు మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెలుగింటి ఆడబిడ్డల పెళ్లికి మేనమామ



కట్నం కింద లక్ష రూపాయలను కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేరుతో అందించి ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపారని తెలిపారు. అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేస్తూ ఆ పథకాలు తీసివేయాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఇది దిక్కుమాలిన చర్యని వారు ఆరోపించారు. గత ఎన్నికల ముందు కళ్యాణ లక్ష్మి పథకం తో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇచ్చిన హామీని నెరవేర్చుకోలేదని వారు మండిపడ్డారు.

ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 420 హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన

**సంక్షేమ పథకాలు కొనసాగించాలని నిరసన**
**కళ్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం అందించాలి**
**తహసిల్దార్‌కు వినతి పత్రం అందించిన గులాబి నేతలు**



చిత్రపటాన్ని కాల్చివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు సురేందర్రావు మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డి మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ రఫీ కౌన్సిలర్లు పొన్నగంటి రాము డాక్టర్ కేసురంజన్ వేణుగోపాలరావు తో పాటు నాయకులు మాజీ ఎంపీటీసీ తోట లక్ష్మణ్ మనోహర్ రావు పర్లపెల్లి రమేష్ పాతకాల రమేష్ గాజుల భాస్కర్ బీసీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు వజ్జపల్లి శ్రీనివాస్ బిట్ల రాజేందర్ రాచపల్లి వంశీ గరిగంటి శ్రీనివాస్ తో పాటు పలువురు టిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో భక్తుల సందడి

**నాగుల పంచమి సందర్భంగా**



**జమ్మికుంట, (సింగిడి):** శ్రావణమాసం సోమ వారం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని అతి పురాత నమైన శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవాలయం భక్తు లతో కిటకిటలాడింది. పట్టణంలోని అతి పురాతనమైన విశ్వే శ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా సోమ వారం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో పాటు నాగుల పంచమి సందర్భంగా వందలాది మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దేవాల యం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నాగేంద్రునికి పాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ విధంగా శ్రావణమాసంలో సోమవారం రోజున శివునికి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ శ్రావణమాసంలో సోమవారం రోజున నాగుల పంచమి రావడం అత్యంత విశేషమైన రోజు అని ఈ రోజున పూజలు నిర్వహించడం వల్ల భక్తుల కోరిన కోరికలు నెరవేరుతాయని జమ్మికుంట పట్టణ ప్రజలపై ఆ విశ్వేశ్వరుని దీవెనలు ఉంటాయని పేర్కొన్నారు.

## ఘనంగా నాగుల పంచమి



**వెల్గటూర్, (సింగిడి):** మండలంలో సోమవారం నాగుల పంచమి పర్వదినాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో మహిళలు వేకువజామునే స్నానమాచరించి, తమకు సమీపంలోని పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోరికలు తీర్చే నాగమ్మ తమ కుటుంబాలను చల్లగా చూడాలని భక్తులు ప్రార్థించారు. తరతరాలుగా సాంప్రదాయబద్ధంగా పంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో శివాలయాలన్నీ కిటకిటలాడాయి.

**జమ్మికుంటలో నియోజకవర్గం స్థాయి**

# బీఎల్ఏ2ల సమావేశం..

**సర్ ఫేజ్-2పై దిశా నిర్దేశం చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు**



**జమ్మికుంట , (సింగిడి):** హుజురాబాద్ నియోజక వర్గ పరిధిలో ఎస్ఐఆర్ ఫేజ్-2కి సంబంధించి బీఎల్ఏ-2ల తో సోమవారం రోజున బిజెపి ముఖ్య సమావేశం నిర్వహించింది.. ఈ సమావేశానికి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ముఖ్య అతిథిగా విచ్చేసి ఓటర్ల జాబితా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియపై, ఫేజ్ 2 పై చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు.. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్చడం ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయడంపై రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ హరి బాబు ఎస్ఐఆర్ నియోజకవర్గ బీఎల్ఏ-1 పుప్పాల రఘు ఎస్ఐఆర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీహెచ్. నరసింహరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నిర్మలా దేవి, మండల అధ్యక్షులు కొలకాని రాజు, దొంతరవేని రమేష్, తూర్పటి రాజు, పారుపెల్లి కొండాల్ రెడ్డి, ర్యాకం శ్రీనివాస్, బత్తిని నరేష్, బైరెడ్డి వెంకటరమణారెడ్డి వీరితో పాటు పలువురు మండల పదాధికారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

singidinews@gmail.com

సినిమా సింగిడి
Cinma Singidi

మంగళవారం
18-8-2026



Ananya Pandey

# సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. విచారణ వాయిదా



హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసు విచారణ సోమవారం నాంపల్లి కోర్టులో జరిగింది. ఈ కేసుకు సంబంధించి ప్రముఖ నటుడు అల్లు అర్జున్ నాంపల్లి కోర్టు ముందు వీడియో కాన్ఫరెన్స్ (వర్చువల్) ద్వారా హాజరయ్యా రు. ప్రస్తుతం ఆయన 'రాకా' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం, ముంబైలో మకాం వేసి ఆ షెడ్యూల్‌లో పాల్గొనాల్సిన పరిస్థితి ఉండటంతో.. కోర్టుకు నేరుగా కాకుండా వర్చువల్‌గా విచారణకు హాజరై తన వాదనలు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయ స్థానం, వాటిని నమోదు చేసుకుని తదుపరి విచారణను సెప్టెంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది.

# కార్తీక్ ఆర్యన్ 'కెప్టెన్ ఇండియా' సినిమాలో మలయాళ బ్యూటీ!

బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ థ్రిల్లర్ మూవీ 'కెప్టెన్ ఇండియా'. ఈ సినిమాతో టాలెంటెడ్ డైరెక్టర్ షిమిత్ అమిన్ సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ




దర్శకత్వం వహిస్తున్నారు. 'అబ్ తక్ ఛప్పన్', 'చక్ దే! ఇండియా', 'రాకెట్ సింగ్' వంటి క్లాసిక్ హిట్స్ అందించిన ఆయన, దాదాపు 15 ఏళ్ల గ్యాప్ తర్వాత ఈ ప్రాజెక్ట్‌తో గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇస్తుండటంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. హర్మన్ బవేజాకు చెందిన బవేజా స్టూడియోస్, భూషణ్ కుమార్ టెన్షన్ టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'కెప్టెన్ ఇండియా' చిత్రం, ఒక యుద్ధ ప్రాంతం నుంచి భారత్ చేపట్టిన అత్యంత పెద్ద మానవీయ రెస్క్యూ ఆపరేషన్ ఆధారంగా తెరకెక్కుతోంది. ఈ ఆపరేషన్‌ను ముందుండి నడిపించి, అసామాన్యమైన ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఒక పైలట్ పాత్రలో కార్తీక్ ఆర్యన్ కనిపించనున్నారు.

ప్రస్తుతం ఆయన కబీర్ ఖాన్ దర్శకత్వంలో రాబోతున్న స్పోర్ట్స్ డ్రామా షూటింగ్‌లో పాల్గొంటుండగా, త్వరలోనే అది పూర్తి చేసుకుని 'కెప్టెన్ ఇండియా' సెట్స్‌లో అడుగు పెట్టనున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ సినిమాలో పార్వతి తిరువోతు ఒక కీలక పాత్రలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆమె పాత్రకు సంబంధించిన వివరాలను ప్రస్తుతానికి గోప్యంగా ఉంచినప్పటికీ, కథలో ఆమె పాత్ర చాలా ప్రాధాన్యత కలిగి ఉంటుందని తెలుస్తోంది. నిజజీవిత ఘట్టాల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో పార్వతి నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానుందని సమాచారం.



# ఆ ముగ్గురుతో పనిచేయడమే నా కల: అనన్య పాండే



బాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ అనన్య పాండే అతి తక్కువ సమయంలోనే వైవిధ్యమైన పాత్రలో నటించి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' సినిమాతో ప్రేక్షకులను అలరించారు. అయితే ఈ మూవీ బాక్సాఫీసు వద్ద ఆశించినంత స్థాయిలో రాణించకపోవ డంతో కొంత గ్యాప్ తీసుకున్నారు. ఈనేపథ్యంలోనే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన హాట్ ఫొటోలు షేర్ చేస్తున్న అనన్య పాండే తాజాగా ఒక ఇంటర్వ్యూలో భాగంగా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సోషల్ మీడియాలో వ్యాపించే నెగెటివిటీ, ట్రోలింగ్‌తో సతమతమయ్యే వారికి ఆమె ఒక మంచి సలహా ఇచ్చారు. ఆన్‌లైన్ నెగెటివిటీని చూసి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. మనపై నెగెటివిటీ లేదా ట్రోలింగ్ వచ్చినప్పుడు కాస్త ప్రశాంతంగా వెనక్కి తగ్గి ఆలోచిస్తే, ఈ పరిస్థితి కేవలం మన ఒక్కరికే కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరికీ ఎదురవుతోందని అర్థమవుతుందని అన్నారు. సమాజంలో ఎంతో విజయవంతంగా, అత్యంత ఆత్మవిశ్వాసంతో కనిపించే వ్యక్తులు కూడా ఇలాంటి ఆన్‌లైన్ విమర్శలను ఎదుర్కొంటున్నారని గ్రహిస్తే, దానికి ఉండే శక్తి, భయం పూర్తిగా తగ్గిపోతాయని అనన్య వివరించారు. ఇక చిత్రపరిశ్రమలో తాను ఇప్పటివరకు కలిసి పనిచేయని కొందరు దిగ్గజ దర్శకులతో పనిచేయాలని ఉందని తన కోరికను బయటపెట్టారు. బాలీవుడ్ ప్రముఖ దర్శకులు కరణ్ జోహార్, జోయా అక్తర్, సంజయ్ లీల భన్సాలీలతో పనిచేయడం తన డ్రీమ్ లిస్ట్‌లో ఉందని వెల్లడించారు. ఈ ముగ్గురు అగ్ర దర్శకుల దర్శకత్వంలో నటించే అవకాశం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు అనన్య స్పష్టం చేశారు.

# వేస్ట్ చేసే ప్రతి బుల్లెట్‌కు ఒక వ్యాల్యూ

## ఆకట్టుకుంటోన్న చిరంజీవి ట్రైలర్

కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'చిరంజీవి'. ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘువ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని కికు ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై దీప్తి నడిమింటి నిర్మిస్తుండగా.. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ క్రమంలోనే తాజాగా సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఎలా ఉందో చూస్తే.. 'పుట్టినవారు మరణించకతప్పదు, మరణించిన వారు జన్మించక తప్పదు' అనే భగవద్గీత శ్లోకంతో ఆసక్తికరంగా ఈ ట్రైలర్ మొదలవుతుంది. కుడివైపు గుండె ఉండే ప్రాణాంతక వ్యాధి ఉన్నా హీరో చావు నుంచి అనేక సార్లు తప్పించుకుంటూ ఉంటాడు. అతని కోసం కొన్ని గ్యాంగ్స్ వెంటాడుతుంటాయి. హీరో తల్లి అతడిని ప్రాణానికి ప్రాణంగా చూసుకుంటూ కాపాడుకుంటుంది. అతన్ని ప్రేమించే అమ్మాయి కూడా చిరుకు ఏదైనా ఆపద వస్తుందేమో అని భయపడుతుంటుంది. మరోవైపు స్పైడర్ మ్యాన్ గెటప్‌లో ఒక వ్యక్తి విలన్స్‌ను వేటాడుతుంటాడు. 'వేటాడేది పులినైతే వేస్ట్ చేసే ప్రతి బుల్లెట్‌కు ఒక వ్యాల్యూ ఉంటుంది..', వాడు చిరంజీవి, చంపినా చావడు చచ్చినా చావడు..' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090